ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల

జిల్లా వార్తలు

5★★

గురువారం 31 జూలై 2025

ఏసీబీ దూకుడు



- ఏడు నెలల్లో ఏడుగురు లంచావతారులు కటకటాల్లోకి...
- బాధితుల ఫిర్యాదుతో వల పన్ని పట్టుకుంటున్న అధికారులు
- తాజాగా ఏసీబీకి చిక్కిన పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్ ఏఈ

జగిత్యాల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అవినీతి నిరోధక శాఖ దూకుడు పెంచింది. కొన్ని నెలలుగా జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులను లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని కటకటాల్లోకి పంపుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగి లంచం డిమాండ్ చేస్తున్నారని ఎవరైనా ఫిర్యాదు చేస్తే తక్షణమే వల పన్ని పట్టుకుంటున్నారు. బాధితుల నుంచి ఫిర్యాదు రాగానే ఏసీబీ అధికారులు స్పందిస్తుండడంతో అవినీతి అధికారులు పట్టుబడుతున్నారు. ఉన్నత ఉద్యోగం, సమాజంలో గౌరవంఉన్నా అత్యాశకు పోతున్న కొంతమంది అధికారులు లంచాలు తీసుకుంటూ కటకటాల పాలవుతున్నారు. ఇటీవల జిల్లాలో ఏసీబీ వరుస దాడులు కలకలం రేపుతున్నాయి. గత ఏడు నెలల్లో ఏడుగురు అధికారులు ఏసీబీకి పట్టుబడడం చర్చనీయాంశంగా మారింది. తాజాగా బుధవారం జిల్లా కేంద్రంలో పంచాయతీ రాజ్ శాఖ విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ కార్యాలయంలో ఏఈగా పనిచేస్తున్న సింగం అనిల్ కోరుట్లకు చెందిన కాంట్రాక్టర్ వెంకటేశ్‌కు క్వాలిటీ ధ్రువీకరణ పత్రం అందజేయడానికి రూ.7 వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు.

● ఎవరికి ఫిర్యాదు చేయాలి...?

ప్రభుత్వ కార్యాలయాల్లో వివిధ పనుల కోసం లంచం అడిగితే 1064 టోల్‌ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయాలి. సోషల్ మీడియా ప్లాట్ ఫాంలో 9440446106 నంబరుకు గాని, తెలంగాణ ఏసీబీ ఫేస్‌బుక్ అకౌంట్‌కు గాని, ట్విట్టర్‌లో గాని ఫిర్యాదు చేయవచ్చని ఏసీబీ అధికారులు సూచిస్తున్నారు. టోల్‌ఫ్రీ నంబరు హైదరాబాద్ ఏసీబీ కార్యాలయంలో ఉంటుంది. అక్కడి నుంచి ఉమ్మడి జిల్లాలోని ఏసీబీ డీఎస్పీ స్థాయి అధికారి లేదా కార్యాలయానికి సమాచారం అందుతుంది. ఎవరైనా నేరుగా డీఎస్పీ లేదా ఇన్‌స్పెక్టర్లకు

- మిగతా 8లో

ఏడు నెలల్లో ఏడు ఘటనలు...

- జిల్లా కేంద్రంలో బుధవారం పంచాయతీ రాజ్ శాఖ విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ కార్యాలయం ఏఈ సింగం అనిల్ కోరుట్లకు చెందిన ఓ కాంట్రాక్టర్ నుంచి రూ.7 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు.
- ఈ యేడాది జూన్ 2వ తేదీన ఓ రైతు నుంచి మధ్యవర్తి ద్వారా రూ. 10వేల లంచం తీసుకుంటుండగా రాయికల్ ఇన్‌చార్జి తహసీల్దార్ గణేష్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.
- ఏప్రిల్ 11న కలెక్టరేట్‌లోని ట్రెజరీ జిల్లా శాఖ కార్యాలయంలో సీనియర్ అకౌంటెంట్ అరిగె రఘు కుమార్ కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్ వద్ద నుంచి రూ.7వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు.
- మార్చి 6న ధర్మపురి మున్సిపల్ కమిషనర్ కందుకూరి శ్రీనివాస్ కార్యాలయంలో పనిచేసే కాంట్రాక్టు ఎన్విరాల్‌మెంట్ ఇంజ నీర్ మహేశ్ వద్ద వేతనం చెల్లింపు కోసం రూ.20 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు.
- మార్చి 5న పేకాటకేసులో సెల్‌ఫోన్ రిలీజ్ చేయడానికి శ్రీనివాస్ అనే వ్యక్తి వద్ద కోరుట్ల ఎస్‌ఐ శంకరయ్య రూ.5 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు.
- జనవరి 15న ల్యాండ్ మార్ట్‌గేజ్ చేసేందుకు మెట్‌పల్లి సబ్ రిజిస్ట్రార్ అసిఫోద్దిన్, డాక్యుమెంట్ రైటర్ రవి, ఆఫీస్ సబార్డినేట్ రవిలు రూ.5 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.
- ఫిబ్రవరి 7న హన్మకొండలో పనిచేస్తున్న డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ పుప్పాల శ్రీనివాస్‌కు ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయనే ఫిర్యాదు మేరకు జగిత్యాలలోని ఆయన గృహంలో ఏసీబీ అధికారులు సోదాలు చేశారు.



జగిత్యాలలో పంచాయతీరాజ్ కార్యాలయంలో ఏసీబీ అధికారులకు చిక్కిన ఏఈ అనిల్

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



కాంగ్రెస్‌లో చేరిన వారికి పార్టీ కండువా కప్పుతున్న మంత్రి అడ్లూరి

ఎండపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి చూసి బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని రాజారాంపల్లిలో మంత్రి సమక్షంలో పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ధర్మారం, ఎండపల్లి మండలాల నుంచి పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరగా వారికి మంత్రి అడ్లూరి పార్టీ కండువా కప్పి సాదారణంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీలోకి రావడం సంతోషకరమన్నారు. గ్రామ అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేయాలన్నారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో అందరూ కలిసికట్టుగా పనిచేసి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మద్దుల గోపాల్ రెడ్డి, మండల అధ్యక్షులు తాటిపర్తి శైలేందర్ రెడ్డి, సంగ రమేష్ యాదవ్, ఆవుల తిరుపతి యాదవ్, బాలసాని మల్లేశం గౌడ్, గడ్డం లింగారెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

● డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రమోద్‌కుమార్

ధర్మపురి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ప్రమోద్‌కుమార్ అన్నారు. ధర్మపురి బస్తీ దవాఖానను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన దవాఖానలో రోగులకు అందిస్తున్న సేవలు గురించి సంబంధిత వైద్యులను అడిగి ఆయన తెలుసుకున్నారు. టీకాలు సకాలంలో ఇవ్వాలని ఆయన సిబ్బందికి సూచించారు. అలాగే ఓపీ, ల్యాబ్ పరీక్షల రికార్డులను ఆయన పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆయన అన్నారు. రోగులకు అందుబాటులో ఉండి వైద్యులు, సిబ్బంది సేవలు అందించాలని ఆయన సూచించారు. ఆయప వెంట ప్రోగ్రాం అధికారి రవీందర్, వైద్యాధికారి డాక్టర్ వివేక్, సీహెచ్‌వో శాంతిశ్రీ, స్టాఫ్ నర్సు రాణి, సరిత, ఏఎన్ఎం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

జగిత్యాల అర్బన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణా నికి చెందిన 26 మంది యువకులు తమ రక్తాన్ని దానం చేశారు. రక్తదానం చేసిన వారిలో యువ న్యాయవాదులు జెల్ల అనిల్ కుమార్‌తో పాటు పలువురు ఉన్నారు. ఈ కార్య క్రమంలో ఐఎంఏ అధ్యక్షులు గూడూరి హేమంత్, కార్యదర్శి ఆకుతోట శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్స్

ధర్మపురి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలం మగ్గిడి (గొల్లపల్లి) తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో 2025-26 సంవత్సరానికి గాను ఇంటర్ ఎంపీసీ, బైపీసీ మొదటి సంవత్సరానికి గాను ఖాళీ సీట్ల భర్తీ కోసం జూలై 31న స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్వీకరించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటలకు ఎంపికైన విద్యార్థుల జాబితాను ప్రదర్శిస్తామని ఆయన తెలిపారు.

రాయితీపై వ్యవసాయ పనిముట్లు

ఇబ్రహీంపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రైతులకి రాయితీపైన వ్యవసాయ పనిముట్లను అందజేయనున్నట్లు వ్యవసాయ విస్తరణ అధికారి రాజకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకానికి సన్నకారు, చిన్న, మహిళా రైతులు అర్హులన్నారు. సన్న, చిన్నకారు రైతులరే 40శాతం సబ్సిడీ, ఎస్సీ ఎస్టీ రైతులకు 50శాతం సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లను అందించనున్నారు. కావలసిన రైతులు మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో గాని వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద రైతు వేదికల్లో గాని దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందుకోసం పట్టాదార్ పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్‌లు అప్లికేషన్ ఫారానికి జతచేసి ఇవ్వాలని సూచించారు.

'నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం'

మెట్‌పల్లి రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : రైతులు, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే తమ లక్ష్యమని జిల్లా ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సుదర్శనం అన్నారు. మండలంలోని మెట్లచిట్టాపూర్ గ్రామంలోని సబ్ స్టేషన్‌లో రూ.85 లక్షలతో ఏర్పాటు చేసిన అదనపు 5ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్పీడీసీఎల్ ఎస్ఈ మాట్లాడుతూ అన్ని సబ్‌స్టేషన్‌లకు రెండవ ప్రత్యామ్నాయ 33 కేవీ అంతర్గత లైన్ల నిర్మాణాలు చేస్తున్నమన్నారు. దీనిలో భాగంగా 70శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రతికూల వాతావరణ పరిస్థితిలో అతి తక్కువ సమయంలో రెండవ లైన్ నుండి విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామన్నారు. రైతులు మోటరు పంపు సెట్లకు కెపాసిటర్‌లు బిగించుకోవడం వలన ఓవర్ లోడ్, లో ఓల్టేజ్ సమస్యలు అధిగమించవచ్చని, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోకుండా రక్షించుకోవచ్చని, దీనికి రైతులు సహకరించాలన్నారు. వినయక శోభాయాత్రలో ఇబ్బందులు కలుగకుండా ముందస్తుగా పరిశీలిన జరిపి అవసరమైన నూతన స్తంభాలు అమర్చి ప్రమాదాలను నివారించాలని అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం సబ్‌స్టేషన్‌ల్లో మొక్క నాటి నీరు పోసి ప్రతి సబ్ స్టేషన్‌ల్లో కనీసం 45 మొక్కలు నాటాలన్నారు. లైన్లకు అడ్డంగా ఉన్న కొమ్మలను ఎప్పటికప్పుడు పరిశీలించి తొలగించలన్నారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి డీఈ మధుసూదన్, డీఈ ఎమ్మార్టీ గోపికృష్ణ, డీఈ టెక్నికల్ గంగారాం, ఏడీఈలు మనోహర్, రాజు, ఏఈలు అజయ్, రహీం, మాజీ సర్పంచులు బద్దం శేఖర్‌రెడ్డి, ఆకుల రాజారెడ్డి, కార్యదర్శి దివ్య, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సుదర్శనం

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

ధర్మపురి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ధర్మపురి మున్సిపల్ కమిషనర్ మామిళ్ల శ్రీనివాస్‌రావు అన్నారు. వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ధర్మపురి పట్టణంలోని లక్ష్మీనరసింహ కాలనీలలో గల శ్రీ రామాలయం ఆవరణలో డెంగ్యూ, మలేరియా వ్యాధుల పట్ల బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పట్ల ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి మున్సిపల్ ఆధ్వర్యంలో తిరుగుచున్న చెత్త వాహనాలకు అందించాలని ఆయన తెలిపారు. ఇంటి వద్ద మురికి నీరు నిల్వ ఉంచరాదని, ప్లాస్టిక్, డిస్పోజబుల్ గ్లాసులు, పడవేయరాదని ఆయన సూచించారు. అంతకు ముందు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు జ్వరం, మలేరియా, డెంగ్యూ వ్యాధుల కోసం పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నేరెళ్ల పీహెచ్‌సీ డాక్టర్ అస్మాతరుణం, ఎంఎల్‌హెచ్‌పీ మామిడి వినయ్, సీహెచ్‌వో శ్రీనివాస్, సతీష్, మున్సిపల్ మేనేజర్ గంగాధర్, సానిటరీ ఇన్స్‌పెక్టర్ గంగాధర్ పాల్గొన్నారు.

ఫేస్ రికగ్నిషన్‌తో పెన్షన్

- బయోమెట్రిక్ సమస్యకు చెక్
- ప్రత్యేక యాప్‌పై బీపీఎంలకు శిక్షణ పూర్తి
- నూతన విధానంలో పింఛన్ల పంపిణీ షురూ

7



'గంజాయి నిర్మూలనలో పోలీసుల పనితీరు బేష్'

జగిత్యాల క్రైం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : గంజాయి వంటి మాదక ద్రవ్యాల నిర్మూలనలో జగిత్యాల జిల్లా పోలీసులు చేపట్టిన చర్యల పనితీరును తెలంగాణ నార్కోటిక్ బ్యూరో డీజీపీ సందీప్ శాండిల్య ప్రశంసించారు. నగదు రివార్డులను ప్రకటించి జిల్లా పోలీస్ అధికారులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో బుధవారం జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ చేతుల మీదుగా పోలీస్ అధికారులతో పాటు సిబ్బందికి రివార్డులను అందజేసి మాట్లాడారు. జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, నిల్వ, వినియోగంపై నిరంతరంగా నిఘా పెట్టి పోలీస్ అధికారులు చేబడుతున్న కఠిన చర్యలు అభినందనీయమని ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనలో ప్రతి పోలీస్ అధికారి కఠినంగా వ్యవహరించి రానున్న రోజుల్లో పూర్తిగా నిర్మూలిం చాలని ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.



జగిత్యాల టౌన్ సీఐకి రివార్డు అందజేస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

సూరమ్మ చెరువు పనులు త్వరలో ప్రారంభం

● ఇప్పటికే మత్తడి నిర్మాణం పూర్తి -ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

భీమారం, జూలై30 (ఆంధ్రజ్యోతి): కలికోట సూరమ్మ చెరువు కుడి, ఎడమ కాలువ పనులు త్వరలో ప్రారంభం కాను న్నాయని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. భీమారం మండల కేంద్రంలో బుధవారం భీమారం, మేడిపల్లి, కథలాపూర్ మండలాల ప్రజల జలప్రదాయని కలికోట సూరమ్మ చెరువు ప్రాజెక్టుపై కలెక్టర్ సత్యప్రసాద్, ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. కలికోట సూరమ్మ చెరువు ప్రాజెక్ట్ పనులను ముమ్మరంగా కొనసాగించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. గత ప్రభుత్వ హయాంలో మిగిలిపోయిన మూడు ఎకరాల భూ సేకరణ నష్ట పరిహారాన్ని కలెక్టర్‌తో మాట్లాడి వారికి ఇవ్వడం జరిగిందన్నారు. స్టేజ్-2, ఫేజ్-1 శ్రీపాద ఎల్లంపెల్లి ప్రాజెక్ట్‌లో భాగంగా 2005లో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి నిధులు మంజూరు చేశారన్నారు. రైతులు ఎన్నో సంవత్స రాలుగా ఎదురు చూస్తున్న ప్రాజెక్ట్ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయని తెలి పారు. 2018 ఎన్నికల్లో రూ.200 కోట్లతో అప్పటి మంత్రి హరీష్‌రావు చేతుల మీదుగా ఫౌండేషన్ వేసినా ప్రాజెక్ట్ నిర్మాణంలో ముందడుగు లేదని అన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ తరఫున అనేక ఆందోళనలు చేశామని గుర్తు చేశారు. 2018లో బీఆర్ఎస్ వారు కనీసం భూసేకరణ కోసం కూడా డబ్బులు లేకుండా ఎన్నికల్లో ఓట్ల కోసమే శంకుస్థాపన చేశారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కుడి, ఎడమ కాలువల నిర్మాణానికి 500 ఎకరాల భూ సేకరణకు నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. మొదటి దఫా భూసేకరణకు రూ.10 కోట్లు నిధులు మంజూరై కలెక్టర్ ఖాతాలో జమ అయ్యాయని తెలిపారు. ముఖ్యమంత్రి చొరవతో త్వరలోనే పనులు ప్రారంభిస్తామని విప్ తెలిపారు. గత ప్రభుత్వం రూ.75కోట్ల కాంట్రా క్టర్‌కు బకాయి పెడితే ప్రజా ప్రభుత్వం వచ్చాక వాటిని చెల్లించడం జరిగిందని విప్ తెలిపారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సత్యప్రసాద్

ఇళ్లు నిర్మించుకోని లబ్ధిదారులకు నోటీసులు

కథలాపూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ పథకం కింద ఇళ్లు మంజూరై నిర్మించుకోని వారికి నోటీసులు జారీ చేసినట్టు ఎంపీడీఓ శంకర్‌నాయక్ తెలిపారు. పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసిన పోసినిపేటలో 119 ఇండ్లు మంజూరు కాగా కేవలం 25 మంది మాత్రమే ఇళ్ళు నిర్మించుకునేందుకు ముందుకు వచ్చారని చెప్పారు. మిగిలిన 94 ఇళ్ల లబ్ధిదారులకు నోటీసులు జారీ చేసి ఇళ్ళను రద్దు చేస్తున్నట్టు నివేదికను ఉన్నతాధికారులకు పంపించామన్నారు. మండలంలో ఇప్పటి వరకు 425 ఇండ్లు మంజూరు కాగా 26 బేస్‌మెంట్, 4 గోడలు, 1 స్లాబ్ లెవెల్‌లో ఉన్నాయని తెలిపారు. కొందరికి బేస్‌మెంట్ స్థాయిలో లక్ష రూపాయలు వారి ఖాతాల్లో జమ కాబడ్డాయని అన్నారు. ఇళ్ళ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించామన్నారు. మంజూరైన 40 రోజుల్లో పనులు ప్రారంభించాలనే నిబంధన అమలు చేస్తున్నట్టు చెప్పారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

రాయికల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన పతంగి లక్ష్మికి సీఎంఆర్ఎఫ్ చెక్కును బుధవారం జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతసురేష్ అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు మళ్లీ కేసీఆర్ రావాలంటున్నారని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బర్కం మల్లేష్, మండల ప్రధాన కార్యదర్శి రత్నాకర్ రావు, నాయకులు హన్మాండ్ల మహేష్, మోర వెంకటేశ్వర్లు, సాగర్ రావు, రాజిరెడ్డి, సాయి రెడ్డి, బక్కన్న పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి బలవన్మరణం


శేఖర్(ఫైల్)

వేములవాడ టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో మనోవేదనకు గురైన ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన వేములవాడ పట్టణం తిప్పాపూర్ గ్రామ శివారులో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడ పట్టణంలోని ముదిరాజ్ వీధికి చెందిన బొడిగే శేఖర్(60) పట్టణ కారుఅసోసియేషన్ అధ్యక్షుడిగా జీవనం సాగిస్తున్నాడు. అనారోగ్యం కారణంగా అప్పులు కావడంతో ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తడంతో తిప్పాపూర్ శివారులోని చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి సంతానం లేదు. మృతుడు శేఖర్ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

జెన్‌కో ఉద్యోగి ఆత్మహత్య

జూలపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాచాపూర్ గ్రామపరిధిలో గల జెన్‌కో మినీహైడల్ పవర్ ప్రాజెక్టులో పనిచేస్తున్న పెద్దపల్లికి చెందిన మేడుదుల రాజన్న(49) అనే జెన్‌కో ఉద్యోగి బుధవారం పవర్‌ప్రాజెక్టులో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. జూలపల్లి పోలీసులు అందించిన వివరాల మేరకు.. కాచాపూర్ గ్రామ శివారులోని జెన్కో పవర్‌ప్రాజెక్టులో జూనియర్‌ప్లాంట్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మేడుదుల రాజన్నకు ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. కుమారుడు 2020లో ప్రేమవివాహం చేసుకున్నాడు. వారికి ఒక కుమారుడు ఉన్నారు. సాయికుమార్ ఎంబీఏ చదవడానికి 2022లో యూకే వెళ్లాడు. అప్పటినుంచి సాయికుమార్ భార్య తల్లిగారి ఇంట్లో ఉంటోంది. యూకే వెళ్లిన భర్త 2024లో తిరిగి ఇంటికి తిరిగి వచ్చినా భార్య ఇంటికి రాలేదు. దీంతో రెండు కుటుంబాల మధ్య పంచా యతీలు జరిగాయి. మనస్థాపానికి గురైన రాజన్న జీవితంపై విరక్తిచెంది తాను పనిచేస్తున్న పవర్‌ప్రాజెక్టులో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సనత్‌కుమార్ తెలిపారు.

సౌదీలో యువకుడి బలవన్మరణం


వినోద్(ఫైల్)

కథలాపూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం భూషణరావుపేటకు చెందిన సంగెం వినోద్(30) అనేయువకుడు సౌదీలో బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, బంధువుల కథనం ప్రకారం జిద్దాలోని ఓకంపెనీలో పనిచేస్తున్న వినోద్ ఈనెల 22న గదిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డట్టు తెలిసింది. అయితే ఈ ఘటనపై శవాన్ని మార్చురీలో ఉంచి అక్కడిపోలీసులు విచారణ జరుపు తున్నట్టు సమాచారం. వినోద్‌మృతి వార్తతెలిసి కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. వినోద్ ఆరునెలల క్రితం సౌదీవెళ్లాడు. కాగా ఆత్మహత్య కారణాలు తెలియరాలేదు.

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

జగిత్యాల క్రైం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో కట్టుకున్న భార్యను కడతేర్చిన వ్యక్తికి జీవిత ఖైదుతోపాటు రూ.2వేల జరిమానా విధిస్తూ ఫస్ట్‌అడిషనల్‌డిస్ట్రిక్, సెషన్స్‌జడ్జి నారాయణ బుధవారం తీర్పు నిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కోరుట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని యెకిన్‌పూర్‌కు చెందిన ఎర్ర చంద్రయ్య-గంగరాజు దంపతులు కూలిపని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. మద్యానికి బానిసైన చంద్రయ్య నిత్యం భార్య గంగరాజుతోపాటు అతని కుమారుడు సుధీర్‌ను వేధిస్తూ ఉండేవాడు. 2022అక్టోబర్ 29న ఇంట్లో ఎవరూ లేని సమయంలో చంద్రయ్య మద్యం మత్తులో తనభార్య గంగరాజుతో గొడవపడి గొంతునులిమి హత్యకు పాల్పడ్డాడు. అనంతరం తన భార్య మెడలో ఉన్న బంగారు ఆభరణాలను తీసుకుని మృతదేహాన్ని మూట కట్టి గ్రామశివారులో ఉన్న ఎస్సారెస్పీ కెనాల్‌లో పడేశాడు. గుర్తు తెలియని మహిళ మృతదేహం ఎస్సారెస్పీ కాలువలో ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో దర్యాప్తులో మహిళ మృతదేహం గంగరాజుగా గుర్తించారు. మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు చంద్రయ్యపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి సీఐలు రాజశేఖర్ రాజు, ప్రవీణ్‌కుమార్, సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టు డ్యూటీ అధికారులు గణేష్, రాజు, కిరణ్ సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్‌ప్రాసిక్యూటర్ మల్లేశం కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయికి జీవితఖైదు, జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.



దొంగలున్నారు జాగ్రత్త

పగలు రెక్కీ.. రాత్రి చోరీ..

దొంగలు గ్రామాల్లో బైక్‌లు, ఇతర వాహనాలపై వివిధ రకాల వ్యాపారాల పేరిట తిరుగుతూ పగటిపూట రెక్కీ నిర్వహిస్తున్నారు. తాళం వేసిన ఇళ్లను గుర్తించి అర్ధ రాత్రి వేళ యథేచ్ఛగా వాటిని పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్నారు.

కరీంనగర్ క్రైం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లాలో వరుస దొంగతనాలు ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. ప్రధానంగా తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసు కొని చోరీలకు పాల్పడుతున్నారు. బంగారం, నగదు, వెండి ఇతర విలువైన వస్తువులు ఎత్తుకెళ్తున్నారు. దీంతో అత్యవసర సమయాల్లో ఇళ్లకు తాళం వేసి వెళ్లేందుకు జనం జంకుతున్నారు. కొంతమంది జాగ్రత్తలు తీసుకుంటున్నా ఇటీవల పోలీసు కమిషనరేట్ పరిధిలో పలు చోట్ల జరిగిన దొంగతనాలు కలవర పెడుతున్నాయి.

ఈ నెల 23న తిమ్మాపూర్ మండలం పోరండ్లలో ఆరు ఇళ్ల తాళాలు పగులగొట్టిన దొంగలు మూడు ఇళ్లలో బంగారం, నగదు, వెండి ఎత్తుకుపోయారు. 27న గన్నేరువరం మండలం చీమలకుంటపల్లిలో బీరువాలోని డబ్బులు, బంగారం దొంగిలించుకుపోయారు. 28న మానకొండూర్ మండలం లలితాపూర్‌లో ఓ ఇంటిలో చొరబడి బంగారం, నగదు, విలువైన సొమ్ములు చోరీ చేశారు. వారం రోజుల వ్యవధిలో ఎనిమిది ఇళ్లలో చోరీలకు పాల్పడ్డారు. బాధిత కుటుంబాలు మరుసటి రోజు ఉదయం ఊరు నుంచి వచ్చి చూసే సరికి ఇళ్ల తాళాలు పగు లగొట్టి ఉన్నాయి. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరించి కేసులు నమోదు చేశారు.

● అడ్డుకోలేకపోతున్న నిఘా

ఓ వైపు బ్లూకోల్ట్స్ పోలీసుల గస్తీ, రాత్రి పూట పోలీసు అధికారుల పెట్రోలింగ్, సీసీ కెమెరాల నిఘా ఇవి ఏవీ దొంగతనాలను అడ్డుకోలేకపోతున్నాయి. ఇళ్లకు తాళం వేసిన సందర్భంలో బంగారం, వెండి, నగదు వంటి విలువైనవి లాకర్లలో భద్రపరచుకోవాలని లేదంటే వెంటతీసుకెళ్లాలని పోలీసులు ప్రజలకు సూచిస్తున్నారు. గ్రామీణ ప్రజలు మండల కేంద్రాల్లో దూరంగా ఉన్న బ్యాంకులకు వెళ్లడం, లాకర్లలో విలువైన సొమ్ములు భద్రపరచుకోవడం భారంగా భావిస్తున్నారు. మరోవైపు వ్యవసాయ పనులతో బిజీగా ఉండి ఇళ్లలోనే సొమ్ములు భద్రపరచుకుంటున్నారు. ముఖ్యంగా బంగారం ధర పెరగడం దొంగలకు వరంగా మారింది. ప్రతీ ఇంటా కాస్తోకూస్తో బంగారం ఉంటుంది. దీంతో దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. గ్రామాల్లో పోలీసుల గస్తీ, ప్రజల భద్రత పై చర్చ నడుస్తున్నది. పోలీసుల గస్తీతో పాటు గ్రామ రక్షక దళాలను ఏర్పాటు చేసుకోవాలని ప్రజలు భావిస్తున్నారు. ఇందుకు పోలీసులు కూడా అనుమతి ఇస్తామంటున్నారు.

● ఆనవాళ్లు చిక్కకుండా చోరీలు

ఇళ్లకు వేసిన తాళాలు అలాగే ఉంచుతూ గొళ్లాలను చాకచక్యంగా తొలగించి చోరీలకు పాల్పడుతున్న ఘటనలు ఇటీవల వెలుగుచూశాయి. దొంగలు వారి ఆచూకీ సీసీ కెమెరాలకు చిక్కకుండా ముఖానికి మాస్కులు, వేలిముద్రలు లభించకుండా చేతులకు గ్లౌస్‌లు ధరిస్తున్నారు. సెల్‌ఫోన్ వినియోగించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. జిల్లాలో కొంతకాలం కిందట జరిగిన కొన్ని చోరీ ఘటనల్లో దొంగలు వాకీటాకీలతో మాట్లాడుకున్నట్లు వెల్లడైంది. బైక్‌లను చాలాదూరంలో వదిలిపెట్టి రావడం, చోరీ చేసిన వాహనాలతోనే గ్రామాలకు వెళ్లి దొంగతనాలకు పాల్పడం వంటివాటితో వారిని గుర్తించడం, పట్టుకోవడం పోలీసులకు కష్టతరంగా మారిందంటున్నారు. కొన్ని సంఘటనల్లో తాళం పగులగొట్టే సందర్భంగా శబ్దం పక్కింటికి వినపడకుండా టవల్, బెడ్ షీట్‌లు చుడుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.



చోరీల నియంత్రణకు పోలీసుల సూచనలు

- వీలైనంత వరకు ఇంటి లోపలే నిద్రించేలా చూసుకోవాలి.
- నగలు, డబ్బు, విలువైన వస్తువులు సురక్షితమైన స్థలంలో లేదా లాకర్‌లో ఉంచాలి.
- రాత్రిపూట ఇంటి పరిసరాల్లో లైట్లు వెలుగుతూ ఉండేలా చూసుకోవాలి. ఇంట్లో మనుషులు ఉన్నట్లుగుమ్మం వద్ద చెప్పులు ఉంచాలి.
- చీకటి ప్రదేశాలు దొంగలకు అనువుగా ఉంటాయి. ముఖ్యంగా కదలికను గుర్తించే సెన్సార్ లైట్లు ఏర్పాటు చేసుకోవడం మంచిది.
- గేట్లు రాత్రిపూట మూసి ఉన్నట్లు నిర్ధారించుకోవాలి.
- ఇంటికి తాళంవేసినట్లు కనిపించకుండా కర్టెన్‌ను చాటుగా ఉంచాలి.
- అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి. ఇంటి పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులను గమనిస్తే సమీపంలోని పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
- ఒకే చోట ఎక్కువ మంది గుంపుగా నిద్రపోవడం దొంగలకు సులువుగా ఉంటుంది. వీలైతే వేర్వేరు ప్రదేశాల్లో నిద్రించాలి.
- ఇళ్ల పరిసరాల్లో సీసీ టీవీ కెమెరాల ఏర్పాటుతో దొంగలను గుర్తించడం, పట్టుకోవడం సులభమవుతుంది.

ఈ జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా దొంగతనాలను నివారించవచ్చని, ఆస్తిని కాపాడుకోవచ్చని పోలీసులు పేర్కొంటున్నారు.

ఆశ్రయం కోరి.. హత్యాయత్నం

- వృద్ధురాలి గొంతుకోసిన మహిళ
- ఇంట్లో ఉన్న బంగారం, నగదుతో పరార్
- ఆకునూర్ గ్రామంలో కలకలం
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రమీల

సైదాపూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నమ్మి ఆశ్రయం ఇస్తే గొంతుకోసి నగలు, డబ్బుతో ఉడాయించింది ఓ మహిళ. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలప్రకారం.. కరీం నగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని ఆకునూర్ గ్రామానికి చెందిన రావుల ప్రమీల అనే వృద్ధురాలికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. వారు వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఆకునూర్ గ్రామంలోని తన ఇంటిలో ప్రమీల ఒక్కతే ఉంటోంది. ఈక్రమంలో మంగళవారం సాయంత్రం అదేగ్రామానికి చెందిన మిట్టపల్లిస్వరూప అనే మహిళ తనను తనభర్త కొడుతున్నాడని చెప్పి ప్రమీల ఇంటికి వచ్చింది. ఇంటికి వెళ్తే తనభర్త రాత్రి కొడతాడని, ఇక్కడే మీ ఇంట్లోనే రాత్రి పడుకుంటానని ఆశ్రయం ఇవ్వాలని కోరింది. ప్రమీల మొదట ఒప్పుకోలేదు. కానీస్వరూప మాయ మాటలు చెప్పి ప్రమీలను ఒప్పించింది. ఆ రాత్రి స్వరూప, ప్రమీలఇంట్లోనే పడుకుంది. అర్ధరాత్రి ప్రమీలనిద్రలో ఉన్న సమయంలో స్వరూప, ప్రమీలమీద కూర్చొని గొంతునొక్కి చంపేస్తానని బెదిరించింది. నగలు, డబ్బులు ఎక్కడ ఉన్నాయో తెలుసుకుంది. అనంతరం స్వరూప కత్తితో ప్రమీల గొంతుకోసింది. ప్రమీల స్పృహ కోల్పోవడంతో మృతిచెందిందని భావించి నగలు, డబ్బులు తీసుకొని ఇంటితలుపులు బిగించి బయట తాళంవేసి పారిపోయింది. ప్రమీలకు కొంతసేపటి తరువాత మెలకువ రావడంతో తనకొడుకుకు ఫోన్‌చేసి విషయం చెప్పింది. వెంటనే కొడుకు, ఇతర కుటుంబసభ్యులు వచ్చితాళం పగులగొట్టి ప్రమీలను హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైనచికిత్స కోసం కరీంనగర్‌లోని ఓ ప్రయివేట్ అస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతానికి ప్రమీల ఆరోగ్యంనిలకడగా ఉన్నట్లుకుటుంబసభ్యులు తెలిపారు. నాలుగుతులాల బంగారు నగలు, రూ.40వేల నగదు ఎత్తుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాధితురాలు ప్రమీల కుమారుడు రాజిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

● నగదు, ఆభరణాలు ఎత్తుకెళ్లిన దొంగలు

శంకరపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలంలోని రాజాపూర్ గ్రామంలో తాళంవేసి ఉన్న ఇంట్లో దొంగలు పడి నగదు, ఆభరణాలు ఎత్తుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజాపూర్ గ్రామానికి చెందిన చింతిరెడ్డి మల్లారెడ్డి భార్యతో కలిసి హనుమకొండలోని తనకొడుకు విజయ్‌కుమార్‌రెడ్డి ఇంటికి సోమవారం సాయంత్రం వెళ్లారు. బుధవారం రాజాపూర్‌లోని తనఇంటికి తిరిగి వచ్చేసరికి తాళం పగలగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఇంట్లోని తులం బంగారు ఆభరణాలు, 30 తులాల వెండి ఆభరణాలు, 10పట్టుచీరలు, రూ.40వేలనగదు దొంగిలించినట్లు తెలిపాడు. విజయ్‌కుమార్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు.

రాచర్లగొల్లపల్లిలో బైక్ చోరీ

ఎల్లారెడ్డిపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలోని రహదారిపై నిలిపి ఉన్న ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం అపహరించుకుపోయారు.బాధితుడి కథనం మేరకు.. గంబీరావుపేట మండలం మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన వ్యక్తి వేణుకుమార్ తన బైక్‌పై రాచర్లగొల్లపల్లి గ్రామానికి చేరుకుని స్థానిక మార్కండేయ ఆలయం వద్ద వాహనాన్ని నిలిపాడు. సమీపంలోని పరిచయం ఉన్న వ్యక్తులకు వద్ద వెళ్లి వచ్చి చూసే సరికి ద్విచక్రవాహనం కనిపించకుండాపోయింది. చుట్టుపక్కల ఆరా తీసినా ఫలితం లేకుండాపోయింది. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని బాధితుడు వేణుకుమార్ పేర్కొన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన విద్యార్థి మృతి


సూర్య(ఫైల్)

గొల్లపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో ఉండడం ఇష్టంలేక గొల్లపల్లి మండలం గోవిందుపల్లి గ్రామానికి చెందిన బోనగిరి సూర్య(17) అనే విద్యార్థి పురుగుల మందుతాగి చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. గొల్లపల్లి ఎస్సై కృష్ణారెడ్డి తెలిపినవివరాల ప్రకారం గోవిందుపల్లి గ్రామానికి చెందిన బోనగిరి రాజయ్య కుమారుడు సూర్యను ఇటీవల కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేర్పించారు. అక్కడ చదువు కోవడం ఇష్టంలేక ఇంటికి తిరిగి వచ్చేశాడు. తల్లిదండ్రులు మందలించేసరికి మనస్థాపానికి గురైన సూర్య ఈనెల 25న క్రిమి సంహారక మందుతాగాడు. చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా బుధవారం మరణించినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సన్నాలకు బోనస్ డబ్బులు చెల్లించాలని రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

ఎల్లారెడ్డిపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించి విక్రయించిన సన్నాలకు ప్రభుత్వం బోనస్ డబ్బులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బీజేపీ నాయకులు బుధవారం ఆందోళనకు దిగారు. స్థానిక పాత బస్టాండు ప్రాంతంలో కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. సుమారు గంట పాటు రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలోని సిబ్బంది చేరుకుని నిరసనకారులను శాంతింపజేయడానికి ప్రయత్నించారు. అతి కష్టం మీద నాయకులను అక్కడి నుంచి తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సన్న విక్రయించి నాలుగు నెలలు గడుస్తున్న ప్రభుత్వం చెల్లించకపోవడం అన్యాయమన్నారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే సన్న ధాన్యానికి రూ.500 బోనస్ అందిస్తామని ప్రకటించి అన్నదాతలకు మోసగించిందని ఆరోపించారు. నాలుగు నెలలుగా రైతులు బోనస్ డబ్బుల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. అన్నదాతలను వంచించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బోనస్ డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, నాయకులు తిరుపతిరెడ్డి, లక్ష్మారెడ్డి, గణేశ్, నరేశ్, లక్ష్మణ్, కిరణ్‌నాయక్, ఆంజనేయులు, బాపురెడ్డి, రాజిరెడ్డి, రంజిత్‌కుమార్, బాలగౌడ్, రవినాయక్, పర్శరాములు, బాలయ్య, రవీందర్, సత్యంరెడ్డి, బాలకృష్ణ, తిరుపతి, ప్రకాశ్, జవహర్, చరణ్‌గౌడ్, నవీన్, సాగర్, పూర్ణిమ, లహరి, స్రవంతి, తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

శ్రావణ్‌కుమార్ మృతికి కారకులను అరెస్టు చేయాలి


మానవహక్కుల కమిషన్ కార్యాలయం ఎదుట శ్రావణ్‌కుమార్ తండ్రి, కుటుంబ సభ్యులు

కరీంనగర్ క్రైం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల చొప్పదండిలో పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్న శ్రావణ్‌కుమార్ కేసులో కారకులను అరెస్టుచేయాలని అతడి కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. మహిళాధాణా సీఐశ్రీలత, శ్రావణకుమార్ భార్య నీలిమ, ఆమె తల్లి వినోద, ప్రసన్నకుమార్, ప్రవీణ్ కుమార్, నవీన్‌కుమార్, మధుకుమార్‌ను ఇప్పటి వరకు అరెస్టు చేయలేదని బుధవారం మానవహక్కుల కమిషన్‌కు ఆశ్రయించారు. ఈకేసులో విచారణ అధికారులను మార్చాలని, నిందితులను వెంటనేఅరెస్టుచేసేలా ఆదేశాలు ఇవ్వాలని శ్రావణకుమార్ తండ్రి నర్సింగం, కుటుంబ సభ్యులు కోరారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఎల్లారెడ్డిపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పదిర గ్రామ చిట్టివాగునుంచి నిబంధనలను ఉల్లంఘించి ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నామని తహసీల్దార్ సుజాత బుధవారం తెలిపారు. ఇసుక రవాణాకు మధ్యాహ్నం రెండుగంటల వరకు అనుమతిచ్చామని, సమయం దాటిపోయినా తరలిస్తున్నారనే సమాచారంతో ఆర్‌ఐ శ్రవణ్, సిబ్బంది మాటువేసి వాహనాలను స్వాధీన పర్చుకున్నారని పేర్కొన్నారు. ట్రాక్టర్లను తహసీల్ కార్యాలయానికి తరలించి సీజ్ చేశామని తెలిపారు.

అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

ఎల్లారెడ్డిపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్న టిప్పర్‌ను ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులో పట్టుకున్నామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి బుధవారం తెలిపారు. కామారెడ్డి జిల్లామాచారెడ్డి నుంచి మండలంలోని రాచర్లబొప్పాపూర్‌వైపు మట్టిని రవాణా చేస్తున్న క్రమంలో వాహనాన్ని ఆపి అనుమతి పత్రాలను పరిశీలించామన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి రవాణా చేస్తున్న టిప్పర్‌ను స్వాధీనపర్చుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించామని చెప్పారు. మాచారెడ్డి మండలం భవానీపేట గ్రామానికి చెందిన వాహన డ్రైవర్ కరెయ్యగారి శ్రీనివాస్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

ఇసుక అక్రమ రవాణా కేసులో ఇద్దరి బైండోవర్

కరీంనగర్ క్రైం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇసుకను రవాణచేస్తూ మూడురోజుల కిందట కరీంనగర్‌రూరల్ పోలీసులకు పట్టుబడినకేసులో నిందితులను బుధవారం బైండోవర్‌చేశామని సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని నగునూర్‌కుచెందిన బుర్రగాళ్ల మహేష్, సూర అశోక్‌ను తహసీల్దార్‌ఎదుట హాజరుపరచినట్లు, లక్ష రూపాయల జరిమానా లేదా 6నెలల జైలు శిక్ష విధించేట్లుగా బైండోవర్ చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

విద్యుత్ చౌర్యం కేసులో ఇద్దరికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చౌర్యం కేసులో ఇద్దరికి జరిమానా లేదా మూడునెలల సాధారణ జైలుశిక్ష విధిస్తూ పెద్దపల్లి డిస్ట్రిక్ట్ సెషన్ కోర్టు జడ్జి సునీత కుంచాల తీర్పు చెప్పినట్లు కరీంనగర్ ట్రాన్స్‌కో విజిలెన్స్ సీఐ షాదుల్లాబాబా బుధవారం తెలిపారు. సుల్తానాబాద్ మండలం పూసాలకు చెందిన కంకణాల శ్రీనివాస్, రామడుగు మండలం గోపాల్‌రావుపేటకు చెందిన సందనవేని లక్ష్మణ్ గతంలో విద్యుత్‌చౌర్యానికి పాల్పడుతూ ట్రాన్స్‌కో అధికారులకు పట్టుబడ్డారని. వారికి రూ.6,482, రూ.13,727 జరిమానా లేదా 3 నెలల సాధారణ జైలు శిక్ష విధించారని తెలిపారు.



హెచ్‌టీ సర్వీసుల కోసం సింగిల్ విండో వ్యవస్థ

అందుబాటులోకి ఆన్‌లైన్ దరఖాస్తు విధానం

గణేశ్‌నగర్ జూలై 30 (ఆంధ్రజ్యోతి): హైటెన్షన్ విద్యుత్ సర్వీసుల మంజూరును మరింత సరళీకృతం చేసేందుకు టీజీఎన్‌పీడీసీఎల్ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సింగిల్ విండో వ్యవస్థ అమలు చేస్తోంది. దరఖాస్తు చేసుకునేందుకు ఆన్‌లైన్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. హెచ్‌టీ, 11కేవీ, 33 కేవీ ఆపై ఓల్టేజీ సర్వీసుల మంజూరు కోసం సర్కిల్, కార్పొరేట్ కార్యాలయాల్లో ప్రత్యేకంగా హెచ్‌టీ మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేసింది.

● దరఖాస్తు ఇలా..


హెచ్‌టీ సర్వీసు కోసం వినియోగదారులు టీజీఎన్‌పీడీసీఎల్ పోర్టల్‌లో సంప్రదించాలి. కొత్త అప్లికేషన్ నంబరు(యూఐడీ) ఉత్పన్నమవుతుంది. దరఖాస్తులు సమర్పించిన అనంతరం టీజీఎన్‌పీడీసీఎల్ సర్కిల్ కార్యాలయం డ్యాష్ బోర్డులో కనిపిస్తాయి. కమర్షియల్ ఏడీఈగా పనిచేసే అధికారి ప్రతీ రోజు డ్యాష్ బోర్డును పరిశీలిస్తారు.

● పరిశీలనకు ప్రత్యేక ఏర్పాట్లు

వినియోగదారుల దరఖాస్తుల పరిశీలనకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 11కేవీ ఓల్టేజీ సర్వీసుల దరఖాస్తులను సర్కిల్ కార్యాలయంలో, 33కేవీ ఆపై సర్వీసుల దరఖాస్తులను కార్పొరేట్ కార్యాలయంలోని కమర్షియల్ ఏడీఈలు పర్యవేక్షిస్తారు. అనంతరం ఎస్టిమేట్ వేసేందుకు దరఖాస్తులను సంబంధిత అధికారులకు పంపిస్తారు. కమర్షియల్ ఏడీ, క్షేత్రస్థాయి సిబ్బంది ప్రాంతాన్ని పరిశీలిస్తారు. ఆ తర్వాత అనుమతి కోసం దరఖాస్తులను వరంగల్‌లోని కార్పొరేట్ కార్యాలయ అధికారులకు పంపిస్తారు. 11కేవీ ఓల్టేజీ సర్వీసు దరఖాస్తులను పరిశీలించి అవకాశం ఉంటే రెండు రోజుల్లోనే అప్‌లోడ్ చేస్తారు. అభ్యంతరాలు ఉటే సదరు వినియోగదారుడికి సంక్షిప్త సందేశం (ఎస్ఎంఎస్) రూపంలో సూచనలు పంపిస్తారు. 33కేవీ, ఆపై ఓల్టేజీ సర్వీసులకు కావాల్సిన మౌలిక వసుతుల ఏర్పాటుకు పొందుపరిచిన సమయానుగుణంగా మంజూరు చేస్తారు. దరఖాస్తు దారులు సైతం కార్యాలయాలకు వెళ్లకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తును పరిశీలించుకునే అవకాశం ఉంది.

వినియోగదారులకు మేలు

మేక రమేష్ బాబు, ఎస్ఈ, టీజీ ఎన్‌పీడీసీఎల్



వినియోగదారులకు మేలు చేసేందుకు హెచ్‌టీ సర్వీసుల మంజూరుకు సింగిల్ విండో విధానం అమలు చేస్తున్నాం. పారదర్శకతతోపాటు సర్వీసు మంజూరు వేగవంతమవుతుంది. అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి.

భూసమస్య పరిష్కరించాలని సెల్ టవర్ ఎక్కి నిరసన


సెల్‌ఫోన్ టవర్‌పై కనుకయ్య

ఇల్లంతకుంట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన పందుల కనకయ్య తన భూసమస్య పరిష్కరించాలని కోరుతూ సెల్‌ఫోన్ టవర్ ఎక్కి బుధవారం నిరసన వ్యక్తం చేశారు. కనుకయ్యకు, అతడి కుటుంబ సభ్యులకు మధ్య భూసమయ్య నెలకొంది. సమస్య పరిష్కారం కావడం లేదని పేర్కొంటూ నిరసనకు దిగాడు. విషయం తెలుసుకున్న పోలీసులు పెద్దలింగాపూర్ గ్రామానికి చేరుకొని కనుకయ్యకు నచ్చజెప్పడంతో కిందికి వచ్చాడు.

ఇరువర్గాలపై కేసు నమోదు

సుల్తానాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు భంగం కలిగిస్తున్న ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు సుల్తానాబాద్ పోలీసులు తెలిపారు. మండలంలోని అల్లీపూర్ గ్రామంలో ఓ భూవివాదంలో ఇరువర్గాలు గొడవపడుతుండగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న బ్లూకోర్టు సిబ్బంది ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుల్ దుర్గాదాస్, కానిస్టేబుళ్లు మునీందర్, సదానందంలు అక్కడికి వెళ్లి ఇరువర్గాలను సముదా యించారు.

అయినా వారు వినకపోవడంతో ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు. అనంతరం ఇరువర్గాలను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి సీఐ సుబ్బారెడ్డి, ఏఎస్‌ఐ పీవీ కరుణాకర్ వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తుండగా ఎరుకొండ వినోద్ అనే వ్యక్తి పోలీసులపై దురుసుగా ప్రవర్తించాడు. ఏఎస్సై కరుణాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐశ్రావణ్ కుమార్ కేసు కేసు నమోదు చేశారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో 12మందికి జరిమానా

శంకరపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ వారికి జడ్జి జరిమానా విధించినట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి బుధవారం తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్‌లోపట్టుబడిన 12మందిని హుజూరాబాద్ స్పెషల్‌జుడిషియల్ మేజిస్ట్రేట్ సెకండ్ క్లాస్ ముందు హాజరుపరచగా రూ.15వేల జరిమానా విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఫేస్ రికగ్నిషన్‌తో పెన్షన్



- బయోమెట్రిక్ సమస్యకు చెక్
- ప్రత్యేక యాప్‌పై బీపీఎంలకు శిక్షణ పూర్తి
- నూతన విధానంలో పింఛన్ల పంపిణీ షురూ

జగిత్యాల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్లకు ఇక నుంచి ఫేస్ రికగ్నిషన్ (ముఖ గుర్తింపు) ద్వారా పెన్షన్లు పంపిణీ చేయనున్నారు. చేయూత పథకం కింద అందిస్తున్న పింఛన్ల పంపిణీలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇందుకు ఫేస్ రికగ్నిషన్ అనే ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకవచ్చింది. బయోమెట్రిక్ విధానం వల్ల ఎదురయ్యే ఇబ్బందులను తొలగించడంతో పాటు సులభంగా, వేగంగా పెన్షన్ అందించేందుకు ఈ విధానం తోడ్పడనుంది. ఇప్పటికే సంబంధిత అధికారులు, సిబ్బందికి శిక్షణ అందించారు. ఫేస్ రికగ్నిషన్ యాప్ ద్వారా ఫొటోలు తీసి అప్‌లోడ్ చేసి పింఛన్లు ఇవ్వాలని సర్కారు నిర్ణయించింది. దీని కోసం పోస్టాఫీస్‌ల బీపీఎంలకు ఫేస్ రికగ్నిషన్ యాప్ అప్‌లోడ్ చేసిన సెల్ ఫోన్లు అందజేయనుంది. జూలై నుంచి ఫేస్ రికగ్నిషన్ విధానం ద్వారా పింఛన్లు అందజేయాలని నిర్ణయించారు.

● వేలిముద్రలతో ఇబ్బందులు..

పింఛన్ పొందాలంటే కచ్చితంగా పోస్టాఫీసు లకు వెళ్లి ఆయా అధికారుల వద్ద బయోమెట్రిక్ వేయాల్సి ఉంటుంది. అయితే వృద్ధులకు వేళ్లపై ముద్రలు చెరిగిపోయి స్కాన్ కాకపోవడంతో వారు పింఛన్ తీసుకునేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోం ది. మరోవైపు ఐరిష్‌లో కూడా ఒక్కోసారి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అలాంటి వారు మండల, వార్డు అధికారులు ప్రత్యేకంగా రాసిచ్చిన పత్రం ద్వారా పింఛన్లు పొందుతు న్నారు. వృద్ధుల్లో కొందరు రోగాల బారిన పడి ఇంటికే పరిమిత మైన సమయంలో పింఛన్లు పొందలేకపోతున్నారు.

● బీపీఎంలకు పూర్తయిన శిక్షణ..

పింఛన్ల పంపిణీలో ఫేస్ రికగ్నిషన్ విధానాన్ని ప్రభు త్వం అమలు చేయబోతున్న నేపథ్యంలో బీపీఎంల కు శిక్షణ పూర్తి చేశారు. జిల్లాలోని బ్రాంచి పోస్టు మాస్టర్ల కు (బీపీఎం) ఫేస్ రికగ్నిషన్ యాప్ ఇన్‌స్టాల్ చేసిన సెల్ ఫోన్లను అందజేయనుంది. జిల్లాలోని అన్ని గ్రామాల్లో బీపీఎంలకు సెల్‌ఫోన్లు ఇవ్వడానికి అనుగుణంగా ప్రభుత్వానికి వివ రాలు పంపారు. సాధ్యమైనంత తొందరలో సెల్ ఫోన్లు పంపిణీ చేసి బీపీఎంలు యాప్‌ను ఉపయోగించి పింఛ న్లు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం బీపీ ఎంల వద్ద ఉన్న వ్యక్తిగత సెల్ ఫోన్లలో యాప్‌ను ఇన్‌స్టాల్ చేసి పింఛన్లు అందిస్తున్నారు.

● ఇబ్బందులు దూరం..

ఇప్పటి వరకు బయోమెట్రిక్ ద్వారా పింఛన్ల పంపిణీ జరిగేది. పెన్షన్ పొందాలంటే పోస్టాఫీసుకు వెళ్లి అక్కడ బయోమెట్రిక్ వేయాల్సి ఉంది. ఈ క్రమంలో లబ్ధిదారుల్లో అత్యధికులు వృద్ధులు కావడంతో వేలి ముద్రలు స్కాన్ కాకపోవడంతో వారు పెన్షన్ తీసుకునేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రభుత్వం తెచ్చిన నూతన విధానం ద్వారా బయోమెట్రిక్ ఇబ్బందులు దూరం కానున్నాయి. ఆధార్ ఫొటోతో అనుసంధానమైన లబ్ధిదారుల వివరాలు స్మార్ట్ ఫోన్‌లో ఫొటో తీయగానే చెల్లింపు వివరాలు వస్తాయి. వెంటనే పెన్షన్ డబ్బులు పొందేందుకు ఆస్కారం ఉంది. జగిత్యాల జిల్లాలో 2,26,066 మంది పింఛన్ దారులు ఉన్నారు.

పింఛన్లు సులభంగా అందేలా..

బయోమెట్రిక్ విధానంలో పింఛన్లు ఇవ్వడంలో తలెత్తుతున్న సమస్యలకు చెక్ పెట్టేలా ప్రభుత్వం ఫేస్ రికగ్నిషన్ యాప్‌ను తీసుకొస్తోంది. ప్రభుత్వం అందజేసే సెల్‌ఫోన్లలో బీపీఎంలు పింఛన్‌దారుల పేర్లు, వివరాలను అప్‌లోడ్ చేస్తారు. యాప్ ద్వారా ఫొటో తీసిన వెంటనే పింఛన్ దారుడి వివరాలు వస్తాయి. వారికి పింఛన్ చెల్లించినట్లు నమోదు చేసి పింఛన్ అందజేస్తారు. ఇక నడవలేని వారు, వివిధ రోగాలతో మంచాలకే పరిమితమైన వారికి చివరి రోజు ఇళ్లకు వెళ్లి ఫొటో తీసి పింఛన్ ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో ప్రతి లబ్ధిదారుడికి సులభంగా పింఛన్ అందనుంది.

పకడ్బందీగా అమలు : రఘువరన్, డీఆర్‌డీవో, జగిత్యాల

పెన్షన్ పంపిణీలో అక్రమాలకు చెక్ పెట్టి మరింత పారదర్శకతను తీసుకురావాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఫేస్ రికగ్నిషన్ యాప్‌ను తీసుకువచ్చింది. అధికారులకు, బీపీఎంలకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ పూర్తయింది. పూర్తి స్థాయిలో స్మార్ట్ ఫోన్లను అందించడానికి చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే అమలులోకి తీసుకు వచ్చాం.





రాయికల్‌లో యాప్‌లో పెన్షనర్ల వివరాలు నమోదు చేసి, పెన్షన్ అందిస్తున్న డీఆర్‌డీవో రఘువరన్

ప్రేమ వివాహం వద్దన్నందుకు యువకుడి ఆత్మహత్య



వినయ్ (ఫైల్)

కోరుట్ల రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రేమ వివా హం వద్దన్నందుకు యూసుఫ్‌నగర్‌లో బావు వినయ్ (28) బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, గ్రామస్థుల వివరాల ప్రకారం బావు వినయ్ ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లి ఆరు రోజుల క్రితం గ్రామానికి వచ్చాడు. గల్ఫ్ దేశం నుంచి వస్తున్న విషయం కూడా తల్లి సునీతకు తెలపకపోవడంతో ఎందుకు ఇంత తొందరగా వచ్చావని అడిగింది. వినయ్ తాను ప్రేమించిన అమ్మాయితో వివాహం చేయాలని కోరాడు. ఇదివరకే అక్క ప్రేమ వివాహం చేసుకుందని, నువ్వు అలా చేయ వద్దని తల్లి చెప్పడంతో మనస్తాపానికి గురై వినయ్ ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తల్లీకొడుకు అదృశ్యం

ముత్తారం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ముత్తారం మండల కేంద్రంలోని కాసర్లగడ్డలో తల్లీకొడుకు అదృశ్యమైన సంఘటన వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు, ముత్తారం ఎస్సై గోపతి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. జన్నారం మండలం చింతలగూడ గ్రామానికి చెందిన కొమిర భీమయ్య తన భార్య రేణుక (30), కొడుకు నాలుగు సంవత్సరాలు మహేందర్‌తో కలిసి మండల కేంద్రంలోని కాసర్లగడ్డలోని స్క్రాప్ షాప్‌లో పనిచేస్తున్నారు. భీమయ్య రోజువారీగా ఈ నెల 15న ఉదయం 7గంటలకు పనికి వెళ్లి సాయంత్రం 8 గంటల సమయానికి ఇంటికి వచ్చాడు. భార్య రేణుక, కొడుకు మహేందర్ కనపడకపోవడంతో చుటుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. భీమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముత్తారం ఎస్సై గోపతి నరేష్ తెలిపారు.

ఎస్సారెస్పీకి తగ్గిన వరద

ప్రాజెక్టులోకి 11,990 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



జగిత్యాల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి బుధవారం వరద నీరు తగ్గింది. మధ్యాహ్నం మూడు గంటల వరకు 15,270 క్యూసెక్కులు ఉన్న ఇన్‌ఫ్లో సాయంత్రం వరకు 11,990 క్యూసెక్కులకు తగ్గింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి సామర్థ్యం 80.5 టీఎంసీలకు ప్రస్తుతం 38.151 టీఎంసీల నీరు ఉంది. మిషన్ భగీరథ, ఇతర అవసరాలకు కలిపి ప్రాజెక్టు నుంచి 774 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉంది. జూన్ 1 నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 28.128 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నుంచి వివిధ అవసరాల నిమిత్తం 3.284 టీఎంసీల నీరును వదిలిపెట్టారు. ప్రాజెక్టు నీటిమట్టం పెరగడంపై ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

11వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చొప్పదండి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరంలో 11వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరంలో పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఎలాంటి ఎంట్రెన్స్ పరీక్ష లేకుండానే ప్రవేశం పొంద వచ్చని, నవోదయ వెబ్‌సైట్‌లో ఫారాలను డౌన్‌లోడ్ చేసుకుని పూర్తిచేసిన దరఖాస్తు ఫారాలను ఆగస్టు 10లోగా నవోదయ విద్యాలయంలో సమర్పించాలని సూచించారు.

స్థానిక ఎన్నికల్లో ముదిరాజ్‌లకు అధిక సీట్లు కేటాయించాలి



మాట్లాడుతున్న మత్స్యకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంద నగేశ్

గణేశ్‌నగర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్‌ల జనాభా దామాషా ప్రకారం రానున్న స్థానిక ఎన్నికల్లో అధిక సీట్లు కేటాయించాలని తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ మత్స్యకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంద నగేశ్ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని కెమిస్ట్రీ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో ముదిరాజుల జనాభా 14.6 శాతం ఉందని, అధికారాల్లో వారి ప్రాతినిధ్యం లేదని అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో ముది రాజ్‌లకు కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీలను ఇప్పటివరకు అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏకు మారుస్తామని ప్రకటించినా మాటలకే పరిమితమైందన్నారు. బీజేపీలో సీనియర్ నేత ఈటల రాజేందర్‌కు రాష్ట్ర అధ్యక్ష పదవి ఇవ్వక పోవడం ముదిరాజులపై వివక్షకు నిదర్శనమన్నారు. అధిక సంఖ్యలో ఉండే ముదిరాజ్‌లు రాజకీయంగా చిన్నచూపునకు గురవుతున్నార న్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ముదిరాజ్‌లను పట్టించుకోలేదని అందుకే గుణపాఠం చెప్పామని అన్నారు. ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోకపోతే అసెంబ్లీ ముట్టడికి వెనకాడమని హెచ్చరించారు. తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ కరీంనగర్ జిల్లా అధ్యక్షులుగా సిద్ధిసంపత్‌కు నియామక పత్రం అందజేశారు. సమావేశంలో సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దమ్మన్నపేట విద్యార్థులకు జాతీయ స్థాయి అవార్డు

విద్యార్థులు రూపొందించిన స్మార్ట్ వాష్‌బేషిన్‌కు గుర్తింపు

గంభీరావుపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలంలోని దమ్మన్నపేట ప్రభుత్వ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు సుప్రియ, శ్రీచైత్ర, మధుప్రియలు ఢిల్లీలో బుధవారం జాతీయ స్థాయి అవార్డును అందుకున్నారు. విద్యార్థులు రూపొందించిన స్మార్ట్ వాష్‌బేషిన్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఈక్రమంలో ఈ నెల 27న ఢిల్లీ బయల్దేరి వెళ్లారు. వార్షిక జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ 2020) కార్యాచరణలో భాగంగా నిర్వహించిన కార్యక్రమానికి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, స్వతంత్ర విద్యాశాఖ మంత్రి జయంత్ చౌదరి, కేంద్ర ఉన్నత విద్యా సహాయ మంత్రి సుకాంత మజుందార్ స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్-2025లో జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను, గైడ్ టీచర్ సంపత్‌కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణ యువతలో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు విద్యా విధానం కొత్త మార్గదర్శకాలను సృష్టిస్తోందని, ఇలాంటి ఆవిష్కరణ శక్తిని ప్రోత్సహించడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఏఐసీటీఈ అసిస్టెంట్ డైరెక్టర్ అభయ్‌జేర్, ఇన్నోవేషన్ డైరెక్టర్ ఎలన్‌గోవన్ చేతులు మీదుగా విద్యార్థులు ప్రశంసాపత్రాలు అందుకున్నారు.



ఢిల్లీలో ప్రశంసా పత్రం అందుకుంటున్న విద్యార్థులు

హోరాహోరీగా ఖోఖో పోటీలు

చొప్పదండి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి నవోదయ విద్యాయలయంలో నిర్వహిస్తున్న హైదరాబాద్ రీజియన్ ఖోఖో పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. దక్షిణ భారతదేశంలోని 77నవోదయ విద్యాలయాల నుంచి 560మంది క్రీడాకారులు వివిధ విభాగాల్లో పోటీ పడుతున్నారు. బుధవారం జరిగిన పోటీల్లో పలు జట్లు గెలుపొంది సెమీఫైనల్‌కు చేరాయి. ఫైనల్ పోటీలు గురువారం జరుగుతాయని, గెలుపొందిన జట్లు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతాయని ప్రిన్సిపాల్ మంగతాయారు తెలిపారు.

రిటైర్డు ఏఎస్సై విజయ్‌కుమార్‌ను సన్మానించిన ఇంటెలిజెన్స్ డీజీ

పెద్దపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేసి గత నెల 30వ తేదీన పదవీ విరమణ పొందిన ఇంటెలిజెన్స్ ఏఎస్సై ఎడ్ల విజయ్‌కుమార్‌ను రాష్ట్ర ఇంటిలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి బుధవారం ఘనంగా సన్మానించారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో విజయ్‌కుమార్, సుజాత దంపతులను డీజీ సన్మానించారు. ఈ సందర్భంగా డీజీ శివధర్‌రెడ్డి మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ వరకు పెద్దపల్లి జిల్లాలో విజయ్‌కుమార్ అకుంఠిత దీక్ష, అంకితభావంతో ఇంటిలిజెన్స్ విభాగంలో తన సేవలను అందించారన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని మిగతావాళ్లు పనిచేయాలన్నారు. విజయ్‌కుమార్ ఆయురారోగ్యాలతో శేష జీవితం గడపాలని డీజీ ఆకాక్షించారు.



రిటైర్డు ఏఎస్సై ఎడ్ల విజయ్ కుమార్‌ను సన్మానించిన అధికారులు

అభినవ పూలే రాహుల్‌గాంధీ..

- కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా జన గణనతో పాటు కులగణన చేపట్టాలి
- ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నాకు తరలిరావాలి
- పీసీసీ మాజీ అధ్యక్షుడు హనుమంతరావు

సిరిసిల్ల టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : జ్యోతిబా పూలే, సావిత్రి బాయి పూలే అడుగుజాడల్లో ముందుకు వెళుతున్న రాహుల్‌గాంధీ అభినవ పూలే అని, ఆయనకు అందరం మద్దతివ్వాలని పీసీసీ మాజీ అధ్యక్షుడు హనుమంతరావు అన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ చిత్రపటానికి హనుమంతరావు, జిల్లా నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యం వచ్చిననాటి నుంచి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా కులగణన జరగలేదన్నారు. పార్లమెంట్ ఓబీసీ కన్వీనర్‌గా ప్రధాని మోదీని మూడు సార్లు కలిశానని, బీసీ జనాభా ఎక్కువగా ఉందని, కేంద్రంలో ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖను ఇవ్వాలని కోరినా మోదీ పట్టించు కోలేదన్నారు.

ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 4500 కిలోమీటర్లు పాదయాత్ర చేసి అన్ని వర్గాల ప్రజలను నేరుగా కలిశాడని, అప్పుడు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు న్యాయం జరగాలంటే కులగణన జరగాలని భావించారన్నారు. ఆయన ఆలోచనను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీసీ మంత్రి పొన్నం ప్రభాకర్ క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకొని అసెంబ్లీలో బిల్లు పాస్ చేయించి ఆర్డినెన్స్ తీశారన్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆర్డినెన్స్ జరగదంటే మరొకరు ముస్లింలకు రిజర్వేషన్లను ఒప్పు కోమనడం విడ్డూరంగా ఉందని, ముస్లింలలో కూడా పేదవారు ఉన్నా రని, ఉత్తర ప్రదేశ్‌లో 5శాతం ముస్లింలకు రిజర్వేషన్లు, ఇస్తున్నారని తెలంగాణ ఎందుకు వద్దంటున్నారని ప్రశ్నించారు. బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కులగణన జరపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమగ్ర కులగణన చేపట్టి బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తున్నారన్నారు. దేశ వ్యాప్తంగా జనగణనతో పాటు కులగణనను నరేంద్ర మోదీ ప్రభుత్వం చేపట్టాలని, దేశ వ్యాప్తంగా బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని రాహుల్‌గాంధీ నాయకత్వంలో ఆగస్టు 11, 12, 13 తేదిలలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద చేపట్టనున్నామని, ధర్నాకు తరలిరావాలని పిలుపునిచ్చారు. రాహుల్‌గాంధీకి మద్దనిస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో రాహుల్ గాంధీ చిత్రపటానికి 21 బిందెలతో క్షీరాభిషేకం చేశామన్నారు.

జిల్లా కేంద్రంలోని గ్రంథాలయం సంస్థ పక్కన మహాత్మ జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలను ఏర్పాటు చేయడం కోసం భూమి పూజ చేయడం ఆనందంగా ఉందన్నారు. వారి విగ్రహాల ఏర్పాటుకు తన సహాయంగా రూ. లక్ష విరాళంను టీపీసీసీ కోఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్‌కు అందించారు. విరాళం అందించిన హనుమంతరావుకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల పక్షాన టీపీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథా లయ సంస్థ జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బొప్ప దేవ య్య, జిల్లా ఉపాధ్యక్షుడు వెంగళ అశోక్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు ఎండీ అహ్మద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.



రాహుల్‌గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న హనుమంతరావు

సైబర్ క్రైం ముఠా పట్టివేత

- ప్రత్యేక పరికరంతో ప్రతీరోజు 12 వేల ఫోన్‌కాల్స్
- ఆంధ్రప్రదేశ్ నుంచి 250 సిమ్‌ల కొనుగోలు

మంచిర్యాలక్రైం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మంచిర్యా ల జిల్లా జన్నారంలో భారీ సైబర్ క్రైంకు పాల్పడుతున్న ముఠాలోని నిందితులను మంచిర్యాల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను బుధవారం తన కార్యాలయంలో మంచిర్యాల డీసీపీ వివరాలు వెల్లడించారు. మంచిర్యాల, రామగుండం పోలీసు కమిషనర్, టీజీసీఎస్‌బీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీ కమ్యూనికేషన్ రామగుండం పోలీసులు సంయుక్త ఆపరేషన్ నిర్వహించి సైబర్ ఫైనాన్షియల్ ఫ్రాడ్ సెంటర్‌ను పట్టుకున్నట్లు డీసీపీ భాస్కర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం..

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యాంద్రపు కామేశ్, జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన బాపు బాపయ్య, బాపు మధూకర్, జన్నారం మండలం కిష్టాపూర్‌కు చెందిన బొట్ల రాజేశ్, ఆంధ్రప్రదేశ్‌కు వేదాంతపూర గ్రామానికి చెందిన సాయిక్రిష్ణ అలియాస్ జాక్ కలిసి మంచిర్యాల జిల్లా జన్నారంలో ఒక ప్రత్యేక డివైజ్ ద్వారా 250 సిమ్‌లతో ప్రత్యేక సెటప్‌ను బోడ ప్రభాకర్ ఇంట్లో ఏర్పాటు చేసుకున్నారు. 45 రోజుల నుంచి రోజుకు 12వేల మందికి చొప్పున కాల్స్ చేస్తూ సైబర్ క్రైంకు పాల్పడ్డారు. ఈ సిమ్‌లను ఆంధ్రప్రదేశ్‌లో కొనుగోలు చేశారు. జాక్ అనే వ్యక్తి దీనిలో ప్రదాన నిందితుడు. కాంబో డియాలో ఉంటున్న జాక్ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కామేశ్‌తో పరిచయం చేసుకొన్నారు.

సైబర్ క్రైం కోసం ఒక గ్రామాన్ని ఎంచుకొని ప్రత్యేక సెటప్‌లో సుమారు 260 సిమ్‌కార్డులు, యుఎస్‌బీ కేబుల్, డీలింగ్ పోర్టర్‌లు ఒకే సమయంలో 200 సిమ్‌లను ఆపరేటింగ్ చేసే డివైజ్ ఏర్పాటు చేసుకున్నారు. దీనినుంచి పలువురికి కాల్ చేస్తూ సైబర్ క్రైంకు పాల్పడ్డారు. పూర్తి దర్యాప్తు అనంతరం సైబర్‌క్రైంకు ఎంత మంది బాధితులు ఉన్నారనే విషయాన్ని వెల్లడిస్తామని డీసీపీ తెలిపారు. వారి అకౌంట్లు పూర్తి దర్యాప్తు అనంతరం ఎంత మేరకు మోసం జరిగిందనే విషయాన్ని వెల్లడిస్తామన్నారు. ఒకే టవర్ నుంచి వేల కాల్స్ వెళ్లడం వల్ల టెలీ కమ్యూనికేషన్ అధికారులు రామగుండం పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆపరేషన్ నిర్వహించామన్నారు. ఆపరేషన్‌లో మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్, సైబర్ క్రైం డీఎస్పీ వెంకటరమణారెడ్డి, సీఐ రమణమూర్తి, టెలీకమ్యూనికేషన్ డైరెక్టర్ జనరల్ అనురాగ్, సిబ్బంది పాల్గొన్నారు.

డీఎల్‌ఎడ్‌లో మిగిలిన సీట్లకు మరోవిడత ప్రవేశాలు

డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య

తిమ్మాపూర్/ పెద్దపల్లి కల్చరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేటు డైట్ కళాశాలల్లో డీఎల్ఎడ్ కోర్సులో మిగిలిపోయిన సీట్లకు, ఈడబ్ల్యూఎస్ కేటగిరి కింద 10 శాతం అదనపు సీట్లకు గాను డీఈఈసెట్-2025 ప్రవేశ పరీక్ష ద్వారా అర్హత సాధించిన అభ్యర్థులకు మరో విడత వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు మండలంలోని ఎల్ఎండీ కాలనీలోగల డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈడబ్ల్యూఎస్ కింద ప్రవేశాలు కోరే అభ్యర్థులు ఈనెల 31నుంచి ఆగస్టు2 వరకు ఆన్‌లైన్ ద్వారా డీఈఈసెట్ వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన ఈడబ్ల్యూ ఎస్ అభ్యర్థులు, ఇప్పటివరకు ఒరిజినల్ సర్టిఫికేట్ వెరిఫికేషన్ చేసుకోని అభ్యర్థులు వచ్చేనెల ఆగస్టు3నుంచి 5వరకు సంబంధిత డైట్‌లలో సర్టిఫి కేట్‌లను వెరిఫికేషన్ చేయించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఇప్పటి వరకు కూడా ప్రవేశం పొందనివారు, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు, స్లయిడింగ్ కోరు అభ్యర్థులు ఆగస్టు6,7 తేదీల్లో సంబంధిత కళాశాలల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. పూర్తివివరాలకు డీసెట్ 2025 వెబ్ సైట్‌ను సందర్శించాలని డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య తెలిపారు.

ఆత్మీయ భరోసాకు మోక్షమెప్పుడో..?

- ఎంపిక గ్రామంలో మొదటి విడత చెల్లింపు
- రెండో విడత ఊసే లేదు
- మిగతా గ్రామాల్లో ఎదురుచూపులు

కరీంనగర్ రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారులకు ఎదురు చూపులు తప్పడం లేదు. పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన గ్రామాల్లో ఒక విడత చెల్లించగా మిగతా గ్రామాల్లో ఊసే ఎత్తడం లేదని లబ్ధిదారులు వాపోతు న్నారు. ఉపాధిహామీ కూలీలు, భూమి లేని రైతులకు చేయూత నందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని 2024-25 ఆర్థిక సంవత్సరం చివరలో ప్రారంభించింది. ఈ ఏడాది జనవరి 26న జిల్లా వ్యాప్తంగా ప్రతీ మండలం నుంచి ఒక గ్రామాన్ని ఎంపిక చేసింది. ఆర్థిక సంవత్సరంలో కనీసం 20 రోజులు ఉపాధి పనులు చేసే భూమి లేని వారిని అర్హులుగా గుర్తించారు. మొదటి విడతలో కరీంనగర్ రూరల్ మండలంలో ఆయా గ్రామాల్లో 1,155 మంది కూలీలను ఎంపిక చేశారు.

ఇందులో పైలట్ ప్రాజెక్టు కింద బహదూర్‌ఖాన్ పేటను ఎంపిక చేయగా గ్రామానికి చెందిన 17 మంది లబ్ధి దారుల్లో వివిధ కారణాలతో ఆరుగురిని తొలగించారు. మిగతా 11 మందికి ఆత్మీయ భరోసా పథకం కింద సంవత్సరానికి 12 వేల రూపాయలు అందించనుండగా మొదటి విడతలో 6వేలను ఖాతాల్లో జమ చేశారు. రెండో విడత ఆరు వేలను ఆర్థిక సంవత్సరం ముగిసినా జమ చేయలేదు. జూలైలో రెండో విడత డబ్బులు పడాల్సి ఉంది. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందనా లేక పోవడంతో ఆత్మీయ భరోసా లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో లబ్ధిదారులను ఎంపిక చేసి ఆత్మీయ భరోసా అందిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం పైలట్ గ్రామాలకే పరిమితం చేస్తుండడంపై మిగతా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలూ రాలేదని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని, పైలట్ ప్రాజెక్టు గ్రామాలతోపాటు ఎంపికైన వారందరికీ పథకం అమలు చేయాలని కోరుతున్నారు.



కోతుల దాడిలో వృద్ధురాలికి గాయాలు

మల్యాల, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపల్లికి చెందిన ఓ వృద్ధురాలిపై కోతులు దాడి చేయడంతో గాయాలయ్యాయి. బుధవారం ఉదయం ఇంటి ముందు కూర్చున్న ఖాజాబీ అనే వృద్ధురాలిపై కోతులు దాడి చేయడంతో కన్నుపై భాగంలో గాయం అయింది. దీంతో కుటుంబసభ్యులు వైద్యం కోసం మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు తరలించారు.

అదృశ్యం కేసు నమోదు

బీర్‌పూర్,జులై 30(ఆంధ్రజ్యోతి):బీర్‌పూర్ మండలంలోని మంగేళ గ్రామానికి చెందిన రామడుగు కొండయ్య(64) అనే వ్యక్తి అదృశ్యమయ్యాడని బుధవారం కొండయ్య భార్య సుశీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం ఉదయం 10 గంటలకు ఇంటి నుంచి వెళ్లిన కొండయ్య ఇంటికి రాకపోవడంతో మిస్సింగ్ కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏ ఎస్సై రవీంధర్ తెలిపారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

కథలాపూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ఉల్లాస్ పథకంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా సంఘ సభ్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని డీఆర్‌డీఓ ఏపీడీ సునీత పేర్కొన్నారు. మండల కేంద్రంలోని స్వశక్తి భవన్‌లో వీఓఏలతో బుధవారం వివిధ అంశాలపై సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డీపీఎం విజయభారతి, రమేశ్, సీసీలు తెడ్డు అంజయ్య, అశోక్, రాజేందర్, విజయలక్ష్మీ, ఎంటీకే శాంత, వీఓఏలు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

కొడిమ్యాల, జూలై 30(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన కొత్తూరి గంగబాబు కుమార్తె అఖిల వివాహానికి మంగళవారం రాత్రి 5,016 రూపాయలు, పెళ్ళి బట్టలను ట్రస్ట్ అవర్ జగన్మాత శంకర్ మల్లన్న హ్యూమన్ నెట్‌వర్క్ సామాజిక కార్యకర్త బింగి మనోజ్‌కుమార్ అందించారు.

కస్తూర్బాలో స్పాట్ అడ్మిషన్లు

కథలాపూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : కస్తూర్బాగాంధీ పాఠశాలలో నూతనంగా ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ ఒకేషనల్ కోర్సులు ప్రారంభమైన నేపథ్యంలో స్పాట్ అడ్మిషన్లు ప్రారంభ మైనట్లు ప్రత్యేకాధికారిణి లావణ్య ఒక ప్రకనలో పేర్కొన్నారు. ఈ నెల 31న ఇంటర్ ఒకేషనల్, కంప్యూటర్ సైన్స్ కోర్సుల్లో బాలికలు స్పాట్ అడ్మిషన్లు పొందవచ్చని కోరారు.

రాయితీపై వ్యవసాయ పనిముట్లు

ధర్మపురి/పెగడపల్లి/వెల్గటూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని రైతులకు కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ యాంత్రీకరణ ఉప పథకం (ఎస్ఎంఏఎం) కింద రాయితీపై యంత్ర పరికరాలు అందించడం జరుగుతుందని మండల వ్యవసాధికారి రాజ్‌కుమార్, పెగడపల్లి మండల వ్యవసాయాధికారి శ్రీకాంత్, వెల్గటూర్ మండల వ్యవసాయాధికారి సాయికిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు.

పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలి





సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అశోక్ కుమార్, హాజరైన పోలీసు అధికారులు

జగిత్యాల క్రైం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. పోలీస్ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఆరు నెలల కాలంలో పోలీస్ అధికారుల పనితీరుపై సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. డీఎస్పీలు, సీఐలు తమ పరిధిలో ఉండే పోలీస్ స్టేషన్లలో నమోదైన వివిధ రకాల కేసుల స్థితి గతులను ఎప్పటి కప్పుడు సమీక్షిస్తూ సంబంధిత ఎస్సైలకు సూచనలు ఇవ్వాలన్నారు. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పట్టణాలతో పాటు అన్ని గ్రామాల్లో సీసీ కెమరాల ఏర్పాటుకు కృషి చేసి దొంగతనాలను నివారించాలన్నారు. రానున్న రోజుల్లో వర్షాలు అధికంగా కురిసే అవకాశాలు ఉన్న దృష్ట్యా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రణాళిక బద్ధంగా పనిచేయాలన్నారు. దొంగతనాల నివారణకు ప్రతి సర్కిల్ పరిధిలో ఒక స్పెషల్ టీంను నియమించి నివారణకు కృషి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలతో పాటు వాహనాల తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. రానున్న గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నిర్వాహణకు అధికారులు, సిబ్బంది సన్నద్ధంగా ఉండాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, అక్రమ వ్యాపారాలపై నిఘా ఉంచాల న్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు, సిబ్బందికి ప్రశంస పత్రాలతో పాటు ప్రోత్సహకాలు అందజేవారు. ఈ సమీక్ష సమావేశంలో డీఎస్పీలు వెంకట రమణ, రఘు చందర్, రాములు, వెంకట రమణ, డీసీఆర్‌బీ, ఎస్‌బీ, ఐటీ కోర్, సీసీఎస్ ఇన్స్‌పెక్టర్లు శ్రీనివాస్, ఆరీఫ్‌అలీ ఖాన్, రఫీక్ ఖాన్, ఆర్ఐ వేణు, సీఐలు కరుణాకర్, సుదాకర్, రామ్‌నర్సింహా రెడ్డి, సురేష్ తదితరులు ఉన్నారు.

‘ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి’

రాయికల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీవో రఘువరణ్ అన్నారు. రాయికల్ మండలంలోని అయోధ్య గ్రామంలో బుధవారం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఫేస్ రికగ్నిజేషన్ సిస్టమ్ మొబైల్ యాప్ ద్వారా చేయూత పెన్షన్ల పంపిణీని ఆయన పరిశీలించారు. అనంతరం కొంత మందికి పెన్షన్లను పంపిణీ చేశారు. అలాగే వన మహోత్సవంలో భాగంగా రోడ్లకిరువైపులా మొక్కలు నాటారు. ప్రభుత్వ లోన్స్ ద్వారా ఏర్పాటు చేసుకున్న గానుగ నూనె మిల్లును సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చిరంజీవి, ఏఈవో దివ్య, ఏపీఎం రాజేష్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

●ఇబ్రహీంపట్నం, జూలై30 (ఆంధ్రజ్యోతి): పెన్షన్ల పంపిణీలో పారదర్శకత పాటిస్తున్నట్లు డిఆర్డిఓ రఘువరన్ తెలిపారు. మండలంలోని అమ్మక పేట గ్రామంలో ముఖచిత్ర గుర్తింపు ఆధారంగా పెన్షన్ల పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పోస్ట్ ఆఫీస్ ద్వారా పెన్షన్ల పంపిణీ జరిగేదని, ఇకనుండి పెన్షన్ల పంపిణీ ముఖచిత్రం ఆధారంగా గ్రామపంచాయతీ సెక్రెటరీ, పోస్ట్మాస్టర్ ల ద్వారా గతంలో కంటే పారదర్శకంగా పంపిణీ చేయబడుతుందని తెలిపారు. ముఖచిత్ర పంపిణీలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే వేలిముద్రల ద్వారా పంపిణీ చేస్తామన్నారు. మండలంలో అమ్మక పేట 468, బర్దిపూర్ 286, డబ్బా 72, ఎర్రపూర్ 93, కేశపూర్ 318, కోజన్ కొత్తూరు 429, మూలరాంపూర్ 157, వర్షకొండ 1179 పెన్షన్లు మొత్తం 3632 మందికి గాను రూ.91,98,928లు ముఖచిత్రం ఆధారంగా పంపిణీ చేస్తామన్నారు. మిగతా గ్రామాలలో ఈ విధానం త్వరలోనే పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణ, ఏపీఎం శంకర్, పంచాయతీ సెక్రెటరీ సరిత, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

‘ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి’



ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ లత

మెట్‌పల్లి రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నిర్మాణలు వేగవంతం చేయాలనిఅడిషనల్ కలెక్టర్ బీఎస్ లత అన్నారు. బుధవారం మండలంలోని మారుతినగర్, చౌలమద్ది గ్రామాల్లోని ఇంటి నిర్మాణ పనులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, పిల్లర్స్ స్థాయి వరకు నిర్మాణం పూర్తయి నిలిచి పనులను పరిశీలించి సమస్యలు తెలుసుకుని త్వరగా పూర్తి చేయసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. చౌలమద్దిలో లబ్ధిదారులతో ముఖాముఖిగా మాట్లాడి నిర్మాణాలు చేపట్టిని వారి సమస్యలు అడిగి తెలుసుకుని రోడ్డు, స్థలం సమస్యలను పరిష్కరించి నిర్మాణాలు పనులు త్వరగా ప్రారంభించి పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవడానికి ఎక్కడ కూడా ఇసుక, మొరం సమస్య లేకుండా ప్రభుత్వం సూచించిన విధంవగా నాణ్యతగా ఇండ్లను నిర్మించుకుని త్వరగా పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేయలని లబ్ధిదారులకు సూచించారు. లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలు త్వరగా పూర్తి చేసేందుకు వారికి ప్రోత్సహం అందించాలని ఎంపీడీవో మహేశ్వర్ రెడ్డికి సూచించారు. అనంతరం మెట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. భూభారతి రెవెన్యూ సదస్సులో భూ సమస్యలపై స్వీకరించిన ప్రతీ దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వచ్చే నెల 15 నాటికి తమ పరిధిలోని సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. దరఖాస్తుల వివరాలు తహసీల్దార్ నీతను అడిగి తెలుసుకున్నారు. భూ భారతి దరఖాస్తులను పూర్తి స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని, తిరస్కరించే ప్రతీ దరఖాస్తుకు ఖచ్చితమైన కారణం ఉండాలని, సదరు వివరాలు దరఖాస్తుదారుడికి తెలియజేయాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ నీత, ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డి, ఆర్ఐ కాంతయ్య, పంచాయతీ కార్యదర్శి రవి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ

సారంగాపూర్, జూలై, 30 (ఆంధ్రజ్యోతి) : మండంలోని లక్ష్మీదేవిపల్లి, రంగపేట గ్రామాల్లో బుధవారం ఎంపీడీవో సీహెచ్ గంగాధర్ ఇళ్ళ నిర్మాణాలకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

‘యూరియా కొరత లేదు’

కథలాపూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలో యూరియా కొరత ఉన్నట్టు కొందరు చేస్తున్న దుష్ప్రచారం నమ్మవద్దని ఏఓ యోగిత ఒక ప్రకటనలో తెలిపారు. భూషణరావుపేట సొసైటీ పరిధిలోని చింతకుంటలో 12 టన్నులు, గంభీర్‌పూర్ సొసైటీలో 9 టన్నులు, గ్రోమోర్‌లో 700 బస్తాలు, అంబారిపేటలో 15 టన్నులు, కలికోట ప్రైవేట్ దుకాణంలో 10 టన్నులు, పెగ్గెర్ల పర్టిలైజర్‌లో 15 టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని చెప్పారు.

●మల్లాపూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని ఆందోళన చెంద వద్దని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు జువ్వాడి నర్సింగరావు అన్నారు. బుధవారం మండలంలోని ముత్యంపేట గ్రామంలోని గోదాంను సందర్శించారు.

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కోరుట్ల రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) :తెలుగు ఉపాధ్యాయులు బోధన అభ్యాసంలో గ్రంథాలయంలోని పుస్తకాలు వినియోగించుకోవాలని పరిశీలకుడు కటుకోజ్వల మనోహరాచారి అన్నారు. బుధవారం పట్టణంలోని బాలికల పాఠశాలలో కథలాపూర్, కోరుట్ల మండలాల తెలుగు ఉపాధ్యాయుల ప్రాథమికోన్నత స్థాయి పాఠశాల సముదాయ సమావేశంను పరిశీలకుడు మనోహరా చారి సందర్శిం చారు. పాఠశాల టైంటేబులో లైబ్రరీ పీరియడ్‌ను కేటాయించాలని అన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థి ప్రగతిపై సమీక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్ ప్రధానోపాధ్యాయుడు కృష్ణ మోహన్ రావు, రిసోర్స్ పర్సన్స్ బానుమూర్తి, రామకృష్ణ శాస్త్రి పాల్గొన్నారు.

ఏసీబీ దూకుడు..

(5వ పేజీ తరువాయి)

ఫిర్యాదు చేసినా విచారణ చేస్తారు. ఆరోపణలు నిజం అని తేలితే ఫిర్యాదుదారుడి నుంచి ఏసీబీ అధికా రులు డబ్బులు తీసుకొని వాటికి కెమికల్ కలిపి ఇస్తారు. వారు సూచిం చిన విధంగా అవినీతి అధికారికి వాటిని ఇవ్వాల్సి ఉంటుంది. బాధి తుడు సదరు అధికారి లేదా సిబ్బందికి నగదు ఇవ్వగానే ఏసీబీ అధికారులు రంగంలోకి దిగి వారిని అదుపులోకి తీసుకుంటారు. ఫిర్యాదుదారుడి డబ్బులు కేసు నడుస్తుండగానే 30 నుంచి 45 రోజుల్లో వాపసు వస్తుందని ఏసీబీ వర్గాలు అంటున్నాయి.

●కార్యాలయాల్లోనే లంచం తీసుకుంటూ..

జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో అవినీతి అధికారులను టార్గెట్ చేస్తూ ఏసీబీ నిఘా పెంచడంతో అధికారుల్లో ఆందోళన కలుగుతోంది. ఇటీవల పట్టుబడ్డ పలువురు అధికారులు, ఉద్యోగులు వారు పనిచేసే కార్యాలయాల్లోనే లంచం తీసుకుంటూ ఏసీబీ వలకు చిక్కుతున్నారు. జిల్లాలో రిజిస్ట్రేషన్ శాఖ, ట్రెజరీ శాఖ, మున్సిపల్, శాఖ, పోలీసు శాఖ, రవాణా శాఖ, అటవీ శాఖ, పంచాయతీ రాజ్ శాఖల్లో ఏసీబీ సోదాలు జరగడం, ఆరుగురు అధికారులు పట్టుబడ్డ సంఘటనలు సోషల్ మీడి యాలో హల్‌చల్ చేసింది. మిగితా శాఖ ఉద్యోగులు అప్రమత్తమయ్యారు.

● పట్టుబడుతున్న మధ్యవర్తులు

ఇటీవల కాలంలో ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా దొరికితే క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు మధ్యవర్తుల ద్వారా లంచం తీసుకుంటున్నా వదిలిపెట్టడం లేదు. దీంతో మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న వారు కూడా ఏసీబీ కేసుల్లో ఇరుక్కోక తప్పడం లేదు. ఈ యేడాది జనవరిలో మెట్‌పల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సోదాలు నిర్వహించిన సమయంలో ప్రైవేటు వ్యక్తి అయిన డాక్యుమెంట్ రైటర్‌ను సైతం అదుపు లోకి తీసుకున్నారు. గతంలో మీడియేటర్లు డబ్బులు తీసుకున్నట్లయితే వారిని అరెస్టు చేసే విదానాన్ని అవలంబించక పోయేవారు. కొంతకాలంగా వీరిని కూడా పట్టుకుంటుండడంతో అధికార యంత్రాంగం ఎంచుకున్న అవినీతి దారులను మూసివేసే ప్రయత్నం ఏసీబీ చేస్తున్నట్లుగా స్పష్టమవుతోంది.

లంచం అడిగితే సమాచారం ఇవ్వండి

-విజయ్ కుమార్, ఏసీబీ, డీఎస్పీ, కరీంనగర్



ప్రభుత్వ శాఖల్లో పనిచేసే అధికారులు ప్రజలను లంచం అడిగితే అవినీతి నిరోధక శాఖ అధికారులకు నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చు. ఎవరైనా లంచం ఇవ్వాలని అడిగితే 1064 టోల్‌ఫ్రీ నంబరుకు గానీ, ఏసీబీ వాట్సాప్ హెల్ప్‌లైన్ నంబర్ 9440446106కు గాని ఫిర్యాదు చేయాలి.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



రంగపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

సారంగపూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సారంగపూర్ మండలం రంగంపేట జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు తొగిటి సత్యనారాయణ అన్నారు. బుధవారం గ్రామంలో జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు రాజగోపాల్ పాల్గొన్నారు.

●రాయికల్: డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని సైనిక గ్రూప్ సభ్యులు అన్నారు. రాయికల్ మండల కేంద్రంలోని ప్రణుతి జూనియర్ కళాశాలలో బుధవారం గంజాయి, మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పోలీస్ జాబ్స్‌కు ప్రిపేర్ అయ్యే విద్యార్థులకు సైనిక గ్రూప్ అండగా ఉంటుందని జగిత్యాల ఇన్‌చార్జి పంచతి బాలరాజు తెలిపారు. అనంతరం భూపతిపూర్ గ్రామానికి చెందిన రిటైర్డ్ సైనికాధికారి మల్లేశంను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తిరుపతి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థిని ఎంపిక

రాయికల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న టి.అనూష అనే విద్యార్థిని రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైంది. అనూష షాట్‌పుట్ విభాగంలో ప్రథమ స్థానం సాధించి ఆగస్టు 3, 4 తేదీల్లో హన్మకొండలో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్రీనివాస్, పీడీ కృష్ణప్రసాద్ తెలిపారు.

యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం

-మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

పెగడపల్లి, జులై 30 (ఆంధ్రజ్యోతి) : రైతన్నలకు అవసరమగు యూరియా సరఫరాలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. పెగడపల్లి మండల కేంద్రంలో జరిగిన వివాహ వేడుకలో పాల్గొనేందుకు మాజీ మంత్రి ఈశ్వర్ బుధవారం పెగడపల్లికి వచ్చారు. ఈసందర్భంగా మండల కేంద్రంలో కార్యకర్తలతో కలసి ఈశ్వర్ మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి అన్నం పెట్టే రైతన్నకు పంటలకు వేసుకునేందుకు యూరియా దొరకక ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సమయానికి ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన యేడాదిలోపే రైతన్నలకు కష్టకాలం చూపుతున్నారన్నారు. సమావేశంలో పెగడపల్లి విండో చైర్మన్ వోరుగంటి రమణారావు, నాయకులు నరేందర్ రెడ్డి, మల్లారెడ్డి, రాజశేఖర్, లక్ష్మణ్, సత్యనారాయణ రెడ్డి, శ్రీనివాస్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు

-మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 30(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన వర్గాల వారికి మాత్రమే రిజర్వేషన్లు కల్పించాలని తమ ప్రభుత్వం భావిస్తోందని, ఎలాంటి మతపరమైన రిజర్వేషన్లు ఇవ్వట్లేదని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు. సామాజిక వెనుకబాటు తనంలో హిందువులు, ముస్లింలు ఉన్నారని, రిజర్వేషన్ల జాబితా నుంచి ముస్లింలను తీసివేయాలనడం కరెక్ట్ కాదని ఆయన చెప్పారు. గాంధీ భవన్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాహుల్ గాంధీ ఆకాంక్ష మేరకే తెలంగాణలో కులగణన సమర్థవంతంగా చేశామన్నారు. బిల్లు పంపించి 4 నెలలు అయినప్పటికీ కేంద్రం కాలయాపన చేస్తూ, పబ్బం గడుపుతుందని విమర్శించారు. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్ సవరణ చేసేలా చట్టబద్ధత కల్పించకుండా ఉండటాన్ని బట్టి బీజేజీ వైఖరి ఏంటో బయటపడుతోందని దుయ్యబట్టారు. 10 శాతం ముస్లింలను బీసీల్లో చేర్చామని, సామాజిక వెనుకబాటుతనానికి గురవుతున్న ముస్లింలకు గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లలో రిజర్వేషన్లు అమలవుతున్నాయని వెల్లడించారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు తెచ్చింది బీజేపీ నే కదా అని ఆయన అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి బీసీ రిజర్వేషన్ల పై ఇప్పటికైనా జ్ఞానోదయం కలగినందుకు మంచి పరిణామమని జీవన్ రెడ్డి పేర్కొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రులను సద్వినియోగం చేసుకోవాలి

పెగడపల్లి, జులై 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. పెగడపల్లి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం పెగడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికి రక్త పరీక్షలు నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ వైద్య శిబిరాన్ని సందర్శించి రోగులను పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు రాకేష్, సంధ్య, సిబ్బంది ద్వారక, శంకరమ్మ, చిలుకమ్మ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు పోషకాహారం అందించాలి

మెట్‌పల్లిటౌన్, జులై30(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ పిల్లలకు పోషకాహారం అందించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు. బుధవారం పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రంను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాణ్యమైన పోషకహారం అందించేందుకు నూతన మెనూను అమల్లోకి తెచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జెట్టి లింగం, తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహం నుంచి పరారీకి విద్యార్థుల యత్నం

మల్యాల, జూలై 30(ఆంధ్రజ్యోతి): మల్యాల శివారులోని సమీకృత వసతిగృహంలోగల అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు సోమవారం రాత్రి తమఇళ్లకు వెళ్లడానికి గాను వసతిగృహం నుంచి పరారీకి యత్నించారు. 6,8 తరగతులు చదువుతున్న జగిత్యాల గాంధీనగర్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు వారం రోజుల క్రితమే అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో చేరగా తమకు వసతి గృహంలో ఉండాలని అనిపించడం లేదంటూ సోమవారం రాత్రి అందరూ పడుకున్న అనంతరం బయటకు వెళ్లారు. మల్యాల అంగడిబజారులో విద్యార్థులను చూసిన పలువురు యువకులు అనుమానం వచ్చి విచారించగా వసతిగృహం నుంచి ఇంటికి వెళ్లాలనుకుంటున్నట్లు చెప్పారు. దీంతో యువకులు వసతిగృహం సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది ఆ విద్యార్థులను అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ వసతిగృహంకు తీసుకెళ్లారు. ఈ విషయం బుధవారం వెలుగులోకి రావడంతో స్కూల్ ప్రత్యేక అధికారి శ్యాంసుందర్‌ను సంప్రదించగా విద్యార్థులు ఇటీవలే చేరారని, బయటకు వెళ్ళిన్నట్లు వారి తల్లి దండ్రులకు సమాచారం ఇచ్చామని చెప్పారు. వారం రోజులక్రితం కూడా ఓ విద్యార్థి కూడా ఇలాగే వెళ్లడంతో బుధవారం తల్లిదండ్రులు తీసుకువచ్చారు.

కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

సారంగాపూర్, జూలై, 30(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించిన కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు స్థానిక ఎన్నికలో సరైన్ల గుణపాఠం చెప్పేల ప్రజలను చైతన్యవంతులను చేయాలని జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షురాలు దావ వసంత సురేష్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం రేచపల్లి గ్రామంలో నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు తేలు రాజు, సీనియర్ నాయకులు సాగి సత్యంరావు, ఒడ్నాల జగన్, బుచ్చి మల్లయ్య, శ్రీను, మల్లేష్, సాంబారి గంగాధర్ పాల్గొన్నారు.

జెండా పండుగ

మల్యాల, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపేటలో బుధవారం కాంగ్రెస్ జెండా పండుగ నిర్వహించారు. కార్యక్రమంలో ఆనందరెడ్డి, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, శనిగారపు తిరుపతి, గొట్టె హన్మండ్లు, సంత ప్రకాశ్‌రెడ్డి, కట్కం వినయ్, గొట్టె నరేశ్, అంజిరెడ్డి, అనిల్, సంజీవ్, వెంకటేశ్, ఉన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

కొడిమ్యాల, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడూర్‌కు చెందిన కదారి(కవ్వం)రాయమల్లు అనారోగ్యంతో బుధవారం మృతిచెందగా మృతుని కుటుంబ సభ్యులను చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు జీవన్‌రెడ్డి ఉన్నారు.

రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మేడిపల్లిలో రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

భీమారం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నూతన రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి భీమారం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ ప్రజల జీవనంలో రేషన్ కార్డు చాలా కీలకమైన డాక్యుమెంట్ అని, కరెంట్ కనెక్షన్, ఇందిరమ్మ ఇళ్లు, ప్రభుత్వ పథకాల అమలువంటి అనేక కార్యక్రమాలకు రేషన్ కార్డు ఉపయోగపడుతుందని తెలిపారు. నాలుగు నెలల క్రితమే చందుర్తి-మోత్కురావుపేట రోడ్డు నిర్మాణానికి అనుమతులు తీసుకురావడం జరిగిందన్నారు. కానీ కొందరు కావాలని రోడ్డు నిర్మాణానికి అనుమతులు చేయలేమని అంటున్నారని, వాస్తవం తెలుసుకుని మాట్లాడాలని అన్నారు. గత పది సంవత్సరాలు బీఆర్ఎస్, బీజేపీవాళ్లు కనీసం అటవీ శాఖ అనుమతులు తీసుకురాకుండా ఏమి చేశారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మొదటి సంవత్సరంలోనే అటవీ శాఖ అనుమతులు తెచ్చామన్నారు. గత పది సంవత్సరాల్లో రేషన్ కార్డు ఇచ్చి ఉంటే ప్రజలకు ఇంచా ప్రభుత్వ పథకాలు అందేవన్నారు. ఒక కుటుంబంలో రెండు లక్షల పైచిలుకు ఉన్న రుణమాఫీ కేవలం రేషన్ కార్డు లేకపోవడంతో కొంత మందికి రుణమాఫీ కాలేదన్నారు. మీ అసమర్థ ప్రభుత్వం ఆనాడు రేషన్ కార్డులు ఇచ్చి ఉంటే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేవని అన్నారు. ఈ కార్యక్రమంలో భీమారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, అంగడి ఆనంద్ కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● మేడిపల్లి, జూలై 31 : మేడిపల్లి మండలంలో బుధవారం 479 రేషన్ కార్డులను విప్ ఆది శ్రీనివాస్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లడుతూ రేషన్‌కార్డుతో పేద కుటుంబాలకు రూ.10 లక్షల కవరేజి తో ఆరోగ్య శ్రీ లబ్ధి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ సత్యప్రసాద్, ఆర్డీఓ జివాకర్‌రెడ్డి, తహసీల్దార్ మునిందర్, ఆర్ఐ రమేష్ పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు

కోరుట్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరిబాబు అన్నారు. ఆగష్టు2న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించు మహాధర్నా విజయవంతం చేయ్యాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు కోరారు. బుధవారం ఓబిసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్ అద్వర్యంలో ఏర్పాటు చేసిన పట్టణ ఓబీసీమోర్చా సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు పాల్గొన్ని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మోసపూరితమైన హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేస్తుందని అన్నారు. దేశ ప్రదాని నరేంద్ర మోది దేశంను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ప్రపంచ దేశాల మన్ననలను పొందుతున్నాడని అన్నారు. రాష్ట్రంలో ప్రజావ్యతిరేక పరిపాన సాగుతుందని దానికి అడ్డుకట్ట వేయ్యడానికి బీజేపీ అద్వర్యంలో ఆగష్టు 2వ తేదీన మహాదర్నా కార్యక్రమంను నిర్వహిస్తుందని అన్నారు. బీసీ డిక్లరేషన్ కోరకు నిర్వహిస్తున్న మహాదర్నా కార్యక్రమానికి అన్ని వర్గాల వారు పాల్గొని పార్టీ సత్వ చాటాలని అన్నారు. ఈ సమావేశంలో మాజీ కౌన్సిలర్ పెండం గణేష్, మ్యాడవేని నరేష్ బీజేపీ నాయకులు బింగి వెంకటేష్, గుంటుక సదాశివ్, చిరుమల్ల దనంజయ్, కంటం ఉదయ్, ఎర్ర రాజేందర్, తిరుమల వాసు, బెక్కం అశోక్, మైదం సత్యనారాయణ, అల్లె నర్సయ్య, కొడూరి రమణ, రాఘవులు ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుల సమావేశం

రాయికల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూటపెల్లి గ్రామంలో బుధవారం వేంకటేశ్వర కళ్యాణ మండపంలో ఎంపీటీసీ పరిధిలో గల మూటపెల్లి, కొత్తపేట, శివాజీనగర్ గ్రామాల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చే అవకాశం ఉన్నందున బీఆర్ఎస్ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రజల్లో కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకతను గురించి వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఇమ్మనేని ప్రశాంత రావు, మందుల శ్రీనివాస్, అలుపట్ల లక్ష్మణ్, మాద గంగారెడ్డి, గుర్రం నర్సయ్య, వేణు, చిన్నా, చింతలపల్లి శ్రీనివాస్ రెడ్డి, ప్రవీణ్, మల్లన్న, రఘు, రాజం, సురేందర్, రాజు, శంకర్, నర్సయ్య, మోక్షిద్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

రాయికల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ సర్పంచ్ బొలిశెట్టి గంగారాం మరణించగా వారి కుటుంబసభ్యులను మాజీ మంత్రి జీవన్ రెడ్డి బుధవారం పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సోమ వెంకటేష్, సుందరగిరి గంగాధర్, దుంపల నర్సిరెడ్డి, నీలి మహేందర్ పాల్గొన్నారు.

●మెట్‌పల్లిటౌన్, జూలై30 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు షేక్ మహమ్మద్ తల్లి ఇటీవల అనారోగ్యానికి గురి కాగా బుధవారం వారి కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణరావు పరమర్శించారు.

‘యూత్ కాంగ్రెస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి’

మెట్‌పల్లిటౌన్, జూలై30(ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో యూత్ కాంగ్రెస్ నాయకులకు 20 శాతం సీట్లు కేటాయించాలని కోరుతూ బుధవారం యూత్ కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ రావుకు వినతిపత్రం అందజేశారు. యూత్‌కు 20 శాతం సీట్లు కేటాయిస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు యూత్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు పెంట ప్రణయ్ తేజ, పట్టణ అధ్యక్షుడు జెట్టి లక్ష్మణ్, నాయకులు బాల్సని ప్రణయ్ గౌడ్, మిట్టపల్లి భూమేష్ పాల్గొన్నారు.